J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 21 25.10.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## రాజధానికి.. రాజయోగం

### అధికారులకి విధులు పుష్కలంగా నిధులు

కాంగ్రెస్ అధినేత్రి, ఇటలీ రాణి సోనియాగాంధీ పుణ్యమా అంటూ పచ్చని రాష్ట్రంలో చిచ్చు రేగి పదేళ్లు దాటిపోయింది. అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు రెండుగా చీలిపోయి ఒక దశాబ్దం గడచి పోయింది. కాంగ్రెస్‌పార్టీ చేసిన ఘోర పాపం ఆంధ్ర ప్రజలకి శాపంగా మారింది. కొత్త రాష్ట్రంగా 2014లో అవతరించిన ఆంధ్రప్రదేశ్ అథఃపాతాళానికి పడిపోయింది.

శరవేగంగా అభివృద్ధిపథంలో దూసుకుపోతుండిన ఉమ్మడి రాష్ట్రం రెండు ముక్కలై ఆంధ్రప్రదేశ్ అనాథగా మిగిలిపోయింది. రెండు ప్రాంతీయ పార్టీల రాజకీయ ఆధిపత్య పోరులో నలిగి గత పదేళ్ళుగా కనీసం రాజధాని కూడా లేకుండా పోయింది.

3లో

## భార్య విజయమ్మ, కుమార్తె షర్మిల, ఆత్మ కేవీపీతో సహా... జగన్‌కి దూరంగా... బాబుకి దగ్గరగా వై.యస్. వర్గం



### అరెస్టుకి భయపడే జగన్ అడ్డం తిరిగాడా?

దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డితో రాజకీయ, ఆత్మీయ ప్రయాణం చేసినవారందరు క్రమేణా ఒక్కొక్కరుగా ఆయన కుమారుడికి దూరమై వై.ఎస్.కి ఆజన్మశత్రువు చంద్రబాబుకి దగ్గరవుతున్నారా...? అంటే అవుననే సమాధానం చెప్తున్నారు రాజకీయ పరిశీలకులు.

వై.ఎస్. జీవించినంత కాలం ఆయన చంద్రబాబుకి బద్ధశత్రువు. వాళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత రాజకీయ వైరం ఉండేది. వ్యక్తిగతంగా ఒకరిపై ఒకరికి కక్షలు కార్పణ్యాలు లేకపోయినా, రాజకీయంగా మాత్రం ఇద్దరూ నువ్వా-నేనా అన్నట్లుగా తలపడేవారు.

10లో






## టీడీపీ సభ్యత్వాల్లో..
# కోవూరును అగ్రస్థానంలో నిలపాలి

**• నాయకులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ**




కోవూరు నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయ కుడు, కార్యకర్తపై ఉందని, ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగా మిగా నిలపాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకులకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్‌లో ఇటీవల జరిగిన సభ్యత్వ నమోదు శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానికంగా ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, కొత్త–పాత నాయకుల మధ్య సమన్వయం దిశగా కృషిచేయాలని పార్టీలోని సీనియర్ నాయకులను ఆమె కోరారు. టీడీపీ సభ్యత్వ నమోదు నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు కార్తీక్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రనాయుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే ప్రగతి సాధ్యం

ఖాళీ ఖజానాతో అధికారం చేపట్టినా నాలుగు నెలలలోనే సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయగల సామర్థ్యం ఒక్క చంద్రబాబునాయుడుకే ఉందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామంలో రూ.5.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజ్ పనులకు ఆమె ఇటీవల శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి లేక అస్తవ్యస్తమైన గ్రామలకు పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పూర్వ వైభవం తెచ్చేందుకు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో మౌలిక సదుపాయాల కోసం 82 లక్షల రూపాయలను ప్రభుత్వం కేటాయించడం హర్షదాయకమన్నారు.



## వేణుగోపాలస్వామి దేవాలయంలో..
# పవిత్రోత్సవాలు

నెల్లూరు మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో ఈనెల 20న పవిత్రోత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తొలుత శాంతి హోమం, మహాభిషేకం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తిరుమంజన సేవలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, కార్య నిర్వహణాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు జరిగాయి.


# అజయ్‌కుమార్‌కి అభినందనల వెల్లువ



జనసేనాని పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టినప్పటి నుండి ఆయనతో పాటు తోడుగానీడగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకున్న మన నెల్లూరీయుడు స్వర్గీయ వేములపాటి అనంతరామయ్య కుమారుడు వేములపాటి అజయ్‌కుమార్‌ని ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపి టిడ్కో) ఛైర్మెన్‌గా చంద్రబాబు ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే! ఈనెల 23న విజయవాడలో టిడ్కో కార్యాలయంలో ఛైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వేములపాటి అజయ్‌కుమార్‌కి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు పలువురు మంత్రులు, శాసనసభ్యులు, అజయ్ కుమార్ చిన్ననాటి మిత్రులు, అభిమానులు వివిధ శాఖలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని అజయ్‌ని అభినందనలతో ముంచెత్తారు.





నిశ్చయతాంబూలం

భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి 'పద్మవిభూషణ్' ముప్పవరపు వెంకయ్యనాయుడు - శ్రీమతి ఉషమ్మల మనుమడు, యిమ్మణ్ణి వెంకట్ - దీపమ్మల కుమారుడు యిమ్మణ్ణి విష్ణు - సాయి సాత్వికల వివాహ నిశ్చితార్థం అక్టోబర్ 23 బుధవారం ఉదయం గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సహ పలువురు రాజకీయ, వ్యాపార, పారిశ్రామిక, అధికార, అనధికార ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని కాబోయే జంటను ఆశీర్వదించారు.

# రాజధానికి.. రాజయోగం

(మొదటిపేజీ తరువాయి)

విడిపోయిన రెండు రాష్ట్రాలలో 2014లో వేరువేరుగా ఎన్నికలు జరిగి, తెలంగాణలో చంద్రశేఖర రావు, అనాధాంధ్రలో చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన సంగతి జగద్విదితమే. అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే చంద్రబాబు అమరావతిని ఆంధ్రాకి రాజధానిగా ప్రకటించడం, సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీనే రాష్ట్రానికి రప్పించి రాజధాని పనులు ప్రారంభించడం, చకచకా నిర్మాణ పనులని చేపట్టడం కూడా అందరికీ తెలిసిందే.

అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రాజధాని పనులని ఆపేశారు. అమరావతిని అటకెక్కించి మూడు రాజధానుల నినాదాన్ని తెరపైకి తెచ్చాడు. "కొండ నాలుకకి మందేస్తే, ఉన్న నాలుక కూడా ఊడిపోయిందన్నట్లుగా" రాష్ట్రానికి అసలు రాజధానే లేకుండా పోయింది. పదేళ్ళలో కొత్త రాజధాని ఏర్పాటు చేసుకోవాలని విభజన చట్టంలో పేర్కొంటూ అప్పటి వరకు హైదరాబాదుని ఉమ్మడి రాజధానిగా ప్రకటించారు. పదేళ్ళూ గడిచిపోయాయి. హైదరాబాదు కూడా చేజారిపోయింది. ఆంధ్రాకి అసలు రాజధానే లేకుండా పోయింది.

## మళ్ళీ పూర్వ వైభవం!

మొన్నటి తాజా ఎన్నికలలో కూటమి సారధ్యంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు అమరావతికి పూర్వవైభవం తేవడానికి దృఢ సంకల్పంతో కార్యాచరణ మొదలుపెట్టారు. మూడేళ్ళలో శాశ్వత రాజధాని నిర్మించడానికి సన్నాహాలు ప్రారంభించారు. మొన్న శనివారం నాడు (అక్టోబరు 19న) పున:ప్రాణప్రతిష్ట జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో మరో మూడేళ్ళలో 'అమరావతి'ని రాజధానిగా చేసేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, రాజధాని నిర్మాణపు పనులు మళ్ళీ ప్రారంభం కావడం నవ్యాంధ్ర చరిత్రలోనే సువర్ణాధ్యాయం. రాయపూడిలోని సిఆర్‌డిఏ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. 'విధ్వంసం ముగిసింది..నిర్మాణం మొదలైందంటూ' ఆయన రాజధాని నిర్మాణ పనులను తాపీపట్టి మరీ మొదలుపెట్టారు. మూడేళ్ళలోనే రాజధాని నిర్మాణాన్ని పూర్తిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అయిదు కోట్లాంధ్రుల ఆశలను ఆకాంక్షలను నెరవేరుస్తూ అద్భుతమైన రాజధాని నిర్మాణం జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రాజధానిని సుందర నందనవనంగా రూపుదిద్దే బాధ్యతలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణకు, సీఆర్‌డీఏ అధికారులకు అప్పగించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా రాజధాని నిర్మాణం పారదర్శకంగా జరగాలని, రాజధానిలో కాలుష్యం లేకుండా చూడాలని, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



## అమరావతిలో.. ఇక ప్రగతి పరుగులు

అమరావతికి ప్రగతి పనులు పరుగులు పెట్టబోతున్నాయి. అన్నిరకాల అభివృద్ధి పనులతో రాజధాని కళకళలాడేందుకు రాష్ట్రప్రభుత్వం శరవేగంగా ప్రణాళికలు రచిస్తోంది. అమరావతికి దేశంలోని 10 అగ్రశ్రేణి యూనివర్శిటీలు, అగ్రగామిగా ఉన్న 10 ఆసుపత్రులు, మరో 10 అత్యుత్తమ విద్యాలయాలు, ఇంకో 10 అత్యున్నత హోటళ్ళు కూడా వస్తాయని ముఖ్యమంత్రి ప్రకటించడంతో, అందుకు తగ్గట్టుగా రాజధాని నిర్మాణాల పనులు ఊపందుకుంటున్నాయి. అంతేకాదు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతరత్రా ఉన్నతాధికారులు, ఉద్యోగుల నివాసాల కోసం కట్టే అపార్ట్‌మెంట్లు, భవనాలు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ముఖ్య కార్యదర్శులు తదితరుల కోసం కట్టే భవంతులు అన్నీ మహానగరాలకు ధీటుగా ఉండాలని, చుట్టుపక్కల ప్రాంతాలన్నిటినీ కలిపి ఒక మహానగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుండడం హర్షదాయకం.

## కేంద్రం.. భారీ సాయం

రాజధాని నిర్మాణాన్ని గతంలో 42,519 కోట్లతో చేపట్టారు. ఇప్పుడు ఆ అంచనావ్యయం పెరిగి, మరో 7వేల కోట్ల అదనపు భారం పడుతున్న నేపథ్యంలో, అసలే ఆర్థిక అవస్థల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం ముందుకువచ్చింది. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం చొరవతో ప్రపంచ బ్యాంకు, ఏడీబీలు 15వేల కోట్ల రూపాయలు సాయమిచ్చేందుకు సమ్మతించడంతో ఇక రాజధాని నిర్మాణానికి ఆర్థికపరమైన సమస్యలు లేకపోవచ్చు.

రాజధాని కోసం కనీవినీ ఎరుగుని రీతిలో 1631 రోజుల పాటు ఉద్యమించిన అమరావతి రైతుల కల.. ఇన్నాళ్ళకి ఫలించింది. అందుకే, "విధిరాత ఏమిటో స్పష్టమవుతోంది. అయిదేళ్ళ నిర్లక్ష్యం, ఆశల అణచివేత తర్వాత అమరావతి మళ్ళీ ప్రాణం పోసుకుంటోంది. ఇది మన ప్రజా రాజధాని. హృదయాలను కలిపి.. ఒక్కో ఇటుక పేర్చి ఇది పునర్నిర్మిత మవుతోంది'.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా శుభాకాంక్షలు చెప్తూ ట్వీట్ చేయడం... అమరావతి రైతులకు, రాష్ట్ర ప్రజలకు ఆనందాన్నిచ్చింది.

### పరిశ్రమల ఏర్పాటుకు..

# అన్ని అనుమతులూ ఇవ్వండి

## అధికారులకు కలెక్టర్ ఆదేశం



జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులను ఆయా శాఖల అధికారులు నిబంధనల మేరకు సకాలంలో మంజూరుచేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈనెల 24న జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతిని ఆయన సమీక్షించారు. పిఎంఈజిపి రుణాల మంజూరు, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం మొదలైన అంశాలను జిల్లా పరిశ్రమలశాఖ జిఎం ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పరిశ్రమల నిర్వాహకులు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని పత్రాలు సమర్పించి అనుమతుల కోసం దరఖాస్తులు చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను వేగవతంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏయేశాఖల పరిధిలో ఎన్ని దరఖాస్తులు ఎంతకాలం నుంచి పెండింగ్‌లో ఉన్నాయో పూర్తి వివరాలను అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. గోల్డ్, ప్రింటింగ్, రెడిమేడ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై దృష్టిసారించాలన్నారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పిఎంఈజిపి రుణాలను విరివిగా మంజూరు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎపిఐఐసి జడ్ఎం శేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డిఎం శ్రీకాంత్ ప్రదీప్, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, డీటీసీ చందర్, ఏపిఎంఐపిడి శ్రీనివాసులు, ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.




లాయర్
అక్టోబర్ 25, 2024

# బాల్య వివాహాల కట్టడికి..సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు!

బాల్యం.. జీవితానికో మధురమైన దశ. అయితే, చిన్నతనం నుంచీ బాగా చదువుకుని జీవితంలో ఉత్తమస్థాయిలో రాణించాల్సిన లక్షలాదిమంది పిల్లలకు బాల్యం కూడా ఒక శాపంగా పరిణమిస్తోంది. కష్టాల కొలిమిలో పడి చిన్నతనం నుంచే ఎంతోమంది జీవితాలు అంధకారబంధురమై పోతున్నాయి. పేదరికం, నిరక్షరాస్యత, అజ్ఞానం, మూఢనమ్మకాలు.. కారణాలేవైతేనేం రకరకాల సామాజిక రుగ్మతలకు, సమాజంలో పేరుకుపోయిన దుష్టసంప్రదాయాలకు బలైపోతూనే ఉన్నారు. అదేం దురదృష్టమో తెలియదు కానీ, మన దేశంలో ఆడపిల్లలు పుట్టినప్పటినుంచి నరకయాతనలు పడాల్సివస్తోంది. పుట్టకముందునుంచే, లింగవివక్షతో గర్భస్థ పిండ దశలోనే వారికి మృత్యువు పొంచి ఉంటోంది. కఠిన చట్టాలెన్నో ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా పుట్టబోయే బిడ్డ ఆడో మగో తెలుసుకుని, ఎంతోమంది ఆడశిశువులను గర్భంలోనే అంతం చేసే కర్కశత్వాల నుంచి మన సమాజం నేటికీ బయటపడకపోవడం దారుణం. చిన్నవయసులోనే బాలికలకు పెళ్ళిళ్ళు చేయడంతో వారి జీవితాలు కన్నీళ్ళలోనే మునిగిపోతున్నాయి. ఇలాంటి అనాగరిక ఆచారాలు మనదేశంలో అనాదిగా సామాజిక దురాచారాలుగా మారి నేటికీ ఎందరో బాలల జీవితాలు నాశనం అవుతున్న నేపథ్యంలో, బాల్య వివాహాలను కట్టడిచేసి, ఆ సామాజిక రుగ్మతను అరికట్టేందుకు ఇటీవల భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) గట్టి చర్యలకు ఉపక్రమించడం హర్షదాయకం. తాజాగా సుప్రీంకోర్టు ధర్మాసనం 141 పేజీల చరిత్రాత్మకమైన తీర్పు చెప్పడంతో పాటు, సరికొత్త మార్గదర్శకాలను కూడా సిద్ధం చేయడం బాలల భవితకు శ్రీరామరక్ష అనే చెప్పవచ్చు. బాల్య వివాహం అనేది.. తన జీవితభాగస్వామిని ఎంచుకునే హక్కును హరిస్తుందని, అందువల్ల వాటిని తప్పకుండా నిరోధించాల్సిందేనని సుప్రీం ధర్మాసనం ఆ తీర్పులో స్పష్టం చేసింది. బాల్య వివాహాల చట్టాల అమలుతీరును ప్రశ్నిస్తూ దాఖలైన ఓ పిల్‌పై సుప్రీంకోర్టులో ఇటీవల విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఆ మేరకు స్పష్టమైన తీర్పు చెప్పింది. బాల్యవివాహం జరిపిన కేసుల్లో వ్యక్తులను శిక్షించినా పెద్దగా మార్పేమీ జరగడం లేదని అభిప్రాయపడింది. మైనర్ల మధ్య జరిగే వివాహాలు స్వేచ్ఛ ఉల్లంఘనేనంది. చిన్నవయసువారు తమ జీవిత భాగస్వామిని ఎన్నుకోలేరనే విషయం తెలుసుకుని బాల్యవివాహాల నివారణకు, మైనర్ల రక్షణకు అధికారులు దృష్టిసారించాలని పేర్కొంది. బాల్య వివాహాలు బాలల విద్యను, వారి ఆశలను.. జీవనావకాశాలను చిదిమేసి వారి ఆరోగ్యాన్ని, హక్కులను దెబ్బతీస్తాయని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. దానిని రూపుమాపేందుకు బహుముఖ కార్యాచరణ అవసరమని, బాల్యవివాహాల నిషేధ చట్టాన్ని తప్పనిసరిగా అమలుచేయాల్సిందేనని స్పష్టం చేసింది. బాల్య వివాహాలు జరగకముందే వాటిని అడ్డుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, ఆమేరకు సమాజంలో అన్ని వర్గాలకు అవగాహన కలిగించాలని విశదీకరించింది. ఈ సందర్భంగా బాల్యవివాహాల కట్టడికి సుప్రీం ధర్మాసనం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. అందులో భాగంగా, దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోను బాల్యవివాహాల నిషేధ అధికారులను ప్రత్యేకంగా నియమించాలని, వారికి ఈ ఒక్క బాధ్యతనే అప్పగించాలే తప్ప ఇతర విధులకు వినియోగించరాదని పేర్కొంది. ప్రత్యేక పోలీస్ విభాగం కూడా ఉండాలని, ప్రతి మూడునెలలకోసారి వీరి పనితీరును సమీక్షించాలని సంబంధిత స్త్రీ శిశు అభివృద్ధి, హోంశాఖలను ధర్మాసనం ఆదేశించింది. ఇలాంటి మరిన్ని పటిష్టమైన నిర్ణయాలను తీర్పులో వెలువరించింది. ఇకనైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో సుప్రీం ధర్మాసనం నిర్ణయాలను అనుసరించాల్సి ఉంది. బాల్యవివాహాలు ఎంత అనర్థదాయకమో వివరిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఉపక్రమించాలి. అందుకు తగ్గ కార్యాచరణ పథకాలను, ప్రచారాలను ముమ్మరం చేయాలి. మూఢ నమ్మకాలను పారద్రోలేందుకు ప్రభుత్వాలతోపాటు సామాజిక సేవాసంస్థలు, మానవతావాదులు, ప్రచార-ప్రసార సాధనాలు ముందుకురావాలి. బాలలకు బందిఖానాలుగా తయారవుతున్న బాల్యవివాహాల నిరోధానికి అందరూ సహకరించి, బాలలను బడిబాటలో పెట్టేందుకు, తద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు చేయూతనివ్వాలి. అప్పుడే ఇలాంటి సామాజిక దురాచారాలను నివారించగలం!..

# జగన్ శిక్షణ తీసుకోవాలి!

ఐదేళ్ళు అధికారంలో ఉన్నన్నినాళ్ళు సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరోజు కూడా మీడియా ముఖం చూడలేదు. ఇప్పుడు కేవలం పులివెందుల శాసన సభ్యుడు స్థాయిలో రోజుకో ప్రెస్‌మీట్ పెడుతున్నాడు. అంతేకాకుండా తరచూ పార్టీ నాయకులతో కూడా సమావేశమవుతున్నాడు. అయితే, ఆ సమావేశాలలో ఆయన మాట్లాడుతున్న తీరే బావుండడం లేదు. ఇటీవల పార్టీ లీడర్లతో మాట్లాడుతూ "నేను మరోసారి అబద్ధం చెప్పుంటే మళ్ళీ గెలిచుండేవాడినని అందరూ అంటున్నారు" అని చెప్పాడు. అంటే ఆయన పోయినసారి ఎన్నికలలో అబద్ధాలు చెప్పి గెలిచాడా...? ఒక ప్రెస్‌మీట్‌లో 'చంద్రబాబు సూపర్ సిక్స్ కాదుకదా సూపర్ వన్ కూడా నెరవేర్చలేదు' అనడానికి బదులుగా "సూపర్ సెవెన్ కూడా నెరవేర్చలేదు" అని అర్థం లేకుండా కామెంట్ చేశాడు. జగన్ ఇలాంటి సమావేశాలలో మాట్లాడేముందు ఒక మంచి డైరెక్టర్‌నో, రైటర్‌నో దగ్గరపెట్టుకుని శిక్షణ తీసుకోమని నా సలహా. అలాగే సమావేశాలకు వచ్చేముందు బాగా రిహార్సల్స్ చేసుకుని వస్తే బాగుంటుంది. ఆయనతో పాటు ఆయనని నమ్ముకున్నోళ్లకి కూడా పరువు దక్కుతుంది.

– జీ.వీ.సుబ్బయ్య, పిడుగురాళ్ళ.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం!

'అంతామాయ' అంటూ సైబర్ నేరాల తీరుపై గత వారం మన 'లాయర్'లో రాసిన వార్త సమాజానికి చాలా ఉపయోగం. ఇలాంటి విషయాలలో ప్రజలని చైతన్య పరచడం చాలా అవసరం. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య బాగా పెరిగింది. అంతర్జాలంపైన, సైబర్ నేరాల విధానాలపైనా అవగాహన కలిగిన ఐటీ ఉద్యోగులు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. అనేక మాయలతో వాళ్ళు బ్లాక్ మెయిలింగ్‌లకి దిగుతున్నారు. సుప్రీం కోర్టు, సిబిఐ, ఎఫ్‌బిఐ, ఈడీ, ఇన్‌కంటాక్స్ వంటి అత్యంత విశ్వసనీయమైన ప్రతిష్టాత్మక సంస్థల ప్రతిష్టని దిగజారుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలి.

కే.నారాయణరెడ్డి, బెంగళూరు.

## మంత్రి నారాయణ గారికి
# అభినందనలు!

2014 – 19 సంవత్సరాల మధ్య తెలుగుదేశం పాలనలో నెల్లూరు నగరంలో భూగర్భడ్రైనేజీ పనులకి అంకురార్పణ జరిగింది. అప్పట్లో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి వెంకయ్యనాయుడు, రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖామాత్యులు పొంగూరు నారాయణ గార్ల చొరవతో పనులు వేగంగా జరిగాయి. నగరమంతా దాదాపుగా నిర్మాణ కార్యక్రమం పూర్తయ్యింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక దాని ప్రారంభ పనులు కొండెక్కాయి. గడచిన అయిదేళ్ళు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం వచ్చాక నెల్లూరీయుల అదృష్టం కొద్దీ నారాయణ గారు మళ్ళీ మునిసిపల్ శాఖ మంత్రి కావడం, నగర భూగర్భ డ్రైనేజీ పనులపై దృష్టి పెట్టడం అభినందనదాయకం. ప్రజా సంక్షేమం పట్ల తపించే నిజమైన నాయకుల చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. అవసరమైన మేరకు నిధులు మంజూరు చేయించి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని నారాయణ గారికి నా విజ్ఞప్తి.

వేపూరు చంద్రశేఖరరెడ్డి,
జగదీష్‌నగర్, నెల్లూరు.

## సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 61

# ఈ దుర్యోధన, దుశ్శాసన... దుర్నీతి లోకంలో..!

*“ఈ దుర్యోధన దుశ్శాసన దుర్నీతి లోకంలో*
*రక్తాశ్రులు చిందిస్తూ రాస్తున్నా శోకంతో*
*మరో మహాభారతం... 'ఆరవ వేదం'*
*మానభంగ పర్వంలో మాతృహృదయ నిర్వేదం”*

ఎప్పుడో నలభై సంవత్సరాల క్రితం వచ్చిన 'ప్రతిఘటన' సినిమాలోని పాట ఇది. అప్పటినుండి ఇప్పటి వరకూ ఆ మాతృ హృదయం ఘోషిస్తూనే ఉంది. మహిళలపైన మగవాడి అరాచకత్వం ఆధిపత్యం చెలరేగుతూనే ఉంది. మానభంగపర్వం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది.

ఇటీవల కర్నూలుజిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని నోట్లో బలవంతంగా పురుగుల మందు పోసి చంపేశాడొక ప్రేమోన్మాది.

మరో సంఘటనలో.. కడపజిల్లా బద్వేల్ వద్ద మరో ఇంటర్ విద్యార్థినిని అటవీప్రాంతంలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చింది మరో మానవ మృగం.

తాజాగా శ్రీకాకుళం జిల్లా పలాస సమీపంలోని కాశీబుగ్గలో పుట్టినరోజు వేడుకలకని చెప్పి ముగ్గురు బాలికలని పిలిచి, వారిలో ఇద్దరిపై గ్యాంగ్ రేప్‌కి పాల్పడింది ఓ కామాంధ మూక. ఈ ముగ్గురు బాలికలు కూడా ఇంటర్ విద్యార్థినులే.

ఈ మూడు వరుస సంఘటనల్లో బాధితురాళ్ళు అందరూ ఇంటర్ విద్యార్థినులు కావడం ఇక్కడ గమనార్హం. మొదటి రెండు సంఘటనలలో ఇద్దరు బాధితులు అత్యంత దారుణంగా, దయనీయంగా మృతిచెందడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ దుర్మార్గపు ప్రేమోన్మాదాలకి ఇంకెందరు బలికావాలోనంటూ మహిళాలోకం బెంబేలెత్తిపోతోంది.

సభ్య సమాజాన్ని ఆవేదనకు గురిచేస్తున్న ఇలాంటి దుర్ఘటనలు ఎక్కడో ఒకచోట నిరంతరం జరిగిపోతూనే ఉన్నాయి. అది ప్రేమోన్మాదం కావచ్చు, ప్రేమ సాకుతో.. పెళ్లి పేరుతో మోసం కావచ్చు. మాయమాటలతో వంచించడం కావచ్చు. అనుమానం పేరుతో అవమానించి చంపడం కావచ్చు. పెళ్లయ్యాక కట్నకానుకల కోసం కాల్చుకుతినడం కావచ్చు.. కారణమేదైనా సమాజంలో ఆడవాళ్లకు మానసికంగా, శారీరకంగా హింసలు తప్పడం లేదు.

గృహహింసలు అనునిత్యం నిరాఘాటంగా జరిగిపోతూనే ఉన్నాయి. ఇంటాబయటా మహిళలకు రక్షణ ఉండడంలేదు. మగాళ్ళు మృగాళ్ళుగా మారి ఆడవాళ్లపై చేస్తున్న దురాగతాలకు అడ్డే ఉండడం లేదు. కఠిన చట్టాలెన్ని వచ్చినా సమాజంలో ఇలాంటి దారుణాలు ఆగడమే లేదు.

## దేశవ్యాప్తంగా మహిళలపై పెరుగుతున్న హింస :

ఏ ఒక్క రాష్ట్రంలోనో కాదు, దేశవ్యాప్తంగా మహిళాలోకంపై హింసాత్మక ఘటనలు నిత్యకృత్యమైపోయాయి. బాలికా దినోత్సవాలు, మహిళా దినోత్సవాల వంటివి ఎంత ఘనంగా జరుపుకుంటున్నా, అవేమీ మహిళల కన్నీళ్లను ఆపలేకపోతున్నాయి. ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప, సమాజంలో విజృంభిస్తున్న పైశాచిక ప్రవృత్తిని నిరోధించలేకపోతున్నాయి. అకృత్యాలకి, అరాచకాలకు బలైపోతున్న మహిళలెంతో మంది బలవన్మరణాలకు కూడా పాల్పడుతున్నారు.

మాయ మాటలతో, మోసపు ఆకర్షణలతో ఎందరో విద్యార్థినులు, యువతులు నేటికీ ప్రేమోన్మాదుల గుప్పెట్లో నలిగిపోతూనే ఉన్నారు. కుటుంబం కోసం, సమాజం కోసం, దేశం కోసం అలుపెరుగకుండా శ్రమిస్తూ ఎంతో మంది మానవీయ మహిళామూర్తులు, మానవతా దీపికలుగా అవతరిస్తున్నారు. తమ సేవలతో తరిస్తున్నారు. అతివల అమాయకత్వాన్ని, వారి ప్రేమ తత్వాన్ని అలుసుగా తీసుకుంటున్న మానవ మృగాలు మాత్రం పురుషాహంకారంతో విర్రవీగుతున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడచిపోతున్నా.. ఆడదన్నాక అన్నీ భరించాలి, అణిగిమణిగి ఉండాలి అన్నట్లుగా మగ పిశాచాలు మహిళలని చిన్నచూపు చూస్తూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఈ ఆచారం కొనసాగుతూనే ఉంది. మగవాడి దురాగతాలకు బలవుతున్న మహిళల సంఖ్య లక్షల సంఖ్యలో ఉంటోంది. అయితే, అవి వేల సంఖ్యలో మాత్రమే బయటకి వస్తున్నాయి. చాలామంది తమపై జరుగుతున్న అకృత్యాలను బయటకి చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్నారు.

## లక్షల్లో బాధితులు.. నీరుగారిపోతున్న కేసులు

ఇటీవలికాలంలో దేశవ్యాప్తంగా ప్రతిఏటా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించి కేసులు లక్షల సంఖ్యలోనే ఉన్నాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకి 2018లో 3.78లక్షల కేసులుంటే, 2019లో వాటి సంఖ్య 4.05 లక్షలకి చేరుకుంది. 2021లో 4.28 లక్షలు 2022లో 4.45 లక్షలు కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ సాక్షాత్తూ కేంద్రప్రభుత్వ గణాంకాలే. నేటికీ ఆ కేసులు కుప్పలుతెప్పలుగా పెరుగుతూనే ఉన్నాయి కానీ, తరగడం లేదు. అయితే, వీటిలో అత్యధికశాతం కేసులు నీరుగారిపోతున్నాయి. బాధితురాళ్లకు సరైన న్యాయం జరగడం లేదనే విమర్శలున్నాయి.

## కఠిన చట్టాలు రావాలి

ఇకనైనా ఈ దుస్థితి మారాలి. మహిళలపై అకృత్యాలకు పాల్పడేవారికి కఠినశిక్షలు పడితే తప్ప ఈ హింసల నుంచి మహిళాలోకానికి విముక్తి కలగదు. ఇప్పటికంటే మరింత పదునైన చట్టాలు చేయాలి. గల్ఫ్ దేశాలలో అమలు చేస్తున్న కఠిన విధానాలు మన దేశంలో కూడా అవలంబించాలి. కేవలం చట్టాలు చేయడమే కాదు, బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ విచారణ జరిపించాలి. దర్యాప్తుల పేరుతో కాలయాపన జరగకుండా తక్షణ శిక్షలుపడేలా చర్యలుచేపట్టాలి. కేసులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వాలు, న్యాయస్థానాలు దృష్టిపెట్టాలి. బాధితులకు అన్యాయం జరుగకుండా చూడాలి.

చిన్నతనం నుంచే సమాజం పట్ల బాధ్యత, మహిళల పట్ల గౌరవం కలిగేలా యువతలో చైతన్యం తీసుకురావాలి. ముఖ్యంగా, నైతిక విద్యాబోధనకు పాఠశాలలు పెద్దపీట వేయాలి. పిల్లలు మంచి ఆలోచనలతో ఎదిగి, పెద్దవారయ్యాక కూడా ఉత్తమంగా రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దాలి. రేపటితరంలో కూడా మానవీయభావాలు, 'సమానత్వ' భావన ప్రతిబింబించేలా ఇప్పటినుంచే అందరూ కృషిచేయాలి!

- రాజశ్రీ

# 'క్యాన్సర్' అంటేనే.. భయపడాల్సిన అవసరం లేదు

## కోవూరు ప్రజలకు ప్రశాంతమ్మ భరోసా



క్యాన్సర్ అంటేనే భయపడాల్సిన అవసరం లేదని, ముందుగా గుర్తిస్తే 90శాతం మరణాలను అరికట్టవచ్చని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇప్పట్లో అందుబాటులో ఉన్న అధునాతన వైద్య విధానాల ద్వారా తొలిదశలో గుర్తించగలిగితే క్యాన్సర్ వ్యాధిని నయం చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్లో ఇటీవల ఆమె ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్స్ చేసే పింక్‌బస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళ మూడేళ్లకు ఒకసారైనా క్యాన్సర్ నిర్ధారణ కోసం మామోగ్రాం పరీక్ష చేయించుకోవాలని కోరారు. కోవూరును క్యాన్సర్ రహిత ఊరుగా మార్చాలనే సంకల్పంతో సెప్టెంబర్ 10న ఇందుకూరుపేటలో క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు ప్రారంభించామని, 600 మంది పరీక్షలు చేయించుకోగా 97 మందికి ఆ వ్యాధి ఉందనే అనుమానంతో, వారిని తదుపరి వైద్య సేవలకై తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌కు తరలించామన్నారు. అదేవిధంగా, కొడవలూరు మండలంలో 1017 మంది క్యాన్సర్ స్క్రీనింగ్స్ చేయించుకోగా 150 పాజిటివ్ కేసులు వచ్చాయని, కోవూరు మండలంలో 1200 మందికిగాను 127మంది క్యాన్సర్ అనుమానితులుగా తేలారన్నారు. వీరిలో చాలా మంది తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌లోను మరి కొందరు స్థానికంగా కూడా వైద్యచికిత్సలు చేయించుకుంటున్నారని ఆమె తెలిపారు. అవసరమైతే టీటీడీ ఆధ్వర్యంలోని ప్రాణదానం ట్రస్ట్ ద్వారా ఉచితంగా సర్జరీ కూడా చేయించుకోవచ్చున్నారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అందించే ఉచిత క్యాన్సర్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చి సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ పద్మజ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ శ్రీహరి, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

● శ్రీసిటీకి ఆధ్యాత్మిక శోభ

# వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుడి వార్షిక వేడుక



అంతర్జాతీయస్థాయ పారిశ్రామికవాడ శ్రీసిటీలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల ఆలయ వార్షికోత్సవాలు అత్యంత వేడుకగా జరిగాయి. వేద మంత్రోచ్చారణలతో ఆలయ పరిసరాలు మారుమ్రోగాయి. పరిశ్రమల ఉద్యోగులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సాహంగా ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. వేదపండితుల సంకల్పం, కలశపూజ, పుణ్యాహ వచనం, వేదపారాయణం కార్యక్రమాలతో ఈ వార్షిక ఉత్సవాలు పండుగలా జర గడం విశేషం. శనివారం తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతంతో ప్రారంభించి గణపతి హోమం, నవగ్రహ హోమం, మహా సుదర్శన హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ హోమపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్చరణల మధ్య చేపట్టిన గోపూజ ఉత్సవం పరిసరాల్లో పవిత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. ఆలయ నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ, అన్నప్రసాదాలు అందచేశారు. మధుసూదనరెడ్డి, పిబిఎస్ శాస్త్రి, పల్లేటి బాలాజీ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ఆలయ వార్షిక ఉత్సవాలను విజయవంతం చేయడం పట్ల డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులు ఆలయాన్ని సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.



## పోలీసు అమరవీరుల

# త్యాగాలు చిరస్మరణీయం

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పోలీసు అమరవీరుల సేవలు, వారి త్యాగాలు అపూర్వమని, ప్రజల రక్షణలో ప్రాణత్యాగం చేసిన ఆ మహనీయులు చిరస్మరణీయులని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. అక్టోబరు 21న నెల్లూరు పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పోలీసు అమరవీరుల సంస్మరణ స్థూపం వద్ద, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ రక్షణలో ఎందరో వీరజవాన్లు ప్రాణాలు కోల్పోతున్నారని, వారి త్యాగనిరతి అమూల్యమని అన్నారు. అదేవిధంగా దేశ అంతర్గత భద్రత విషయంలో పోలీసులు అనునిత్యం పోరాటం చేస్తున్నారని, అసాంఘికశక్తులను కట్టడి చేసేందుకు, నక్సలిజాన్ని రూపుమాపేందుకు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ, పోలీసు కుటుంబాల సంక్షేమం ధ్యేయంగా వారికి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలందిస్తున్నామన్నారు. జిల్లాలో గత సంవత్సరం ప్రాణాలు కోల్పోయిన 12 మంది పోలీసుసిబ్బందికి ఆయన నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరఫున పరిహారం అందించామన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొని పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ చేతులమీదుగ అమరవీరుల సంస్మరణ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిర్వహించారు.



## 31 వరకు వారోత్సవాలు...

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను జిల్లాలో ఈనెల 31వ తేదీ వరకు నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఈనెల 20న ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు, సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాల గురించి ఈ సందర్భంగా అవగాహన కలిగిస్తామన్నారు. పోలీసుల ధైర్యసాహసాల చిత్రాలను సినీథియేటర్లలో, కేబుల్ టీవీల్లో ప్రదర్శిస్తామని, 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రమైన నెల్లూరులోను, అన్ని పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌లలో ఓపెన్‌హౌస్‌లు, చర్చావేదికలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని, 28న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో మెగా వైద్యశిబిరం, రక్తదానశిబిరం ఏర్పాటుచేస్తామని తెలిపారు. అనంతరం, ఈనెల 31న ఏక్‌తా దివస్ సందర్భంగా, సమైక్యతా పరుగుతో వారోత్సవాల ముగింపు ఉంటుందని వివరించారు.



# నెల్లూరు కబుర్లు

## కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా..

# వైఓ నందన్



నెల్లూరు కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పురపాలకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైఓ నందన్ నియమితులయ్యారు. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇప్పటివరకు అదనపు కమిషనర్‌గా ఉన్న శర్మదను మంగళగిరి కార్యాలయానికి బదిలీచేశారు. నందన్ గతంలో నెల్లూరు కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా పనిచేసి ఉన్నారు కూడా. ఈ నెల 22న నందన్ బాధ్యతలు చేపట్టారు.

# స్పాస్టిక్ సెంటర్‌కు కంప్యూటర్ల వితరణ



నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రం (స్పాస్టిక్ సెంటర్) కోసం దాతలు మునగా వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, పేర్ల సీతారామారావు లక్షా 70వేల రూపాయల విలువజేసే నాలుగు కంప్యూటర్లను అందజేశారు. జేవీఆర్ షాపింగ్‌మాల్ అధినేత శ్రీనివాసులు రెండు కుట్టుమిషన్లను ఇచ్చారు. దివ్యాంగుల కేంద్రం కన్వీనర్ ఎంవి సుబ్బారెడ్డి, సబ్‌కమిటీ సభ్యుడు సోమ భక్తవత్సలరెడ్డి, స్మైల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు రాఘవరెడ్డి, రెడ్‌క్రాస్ కమిటీ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, కో-కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్‌మేళాలో.. 33 మంది ఎంపిక

ఈనెల 22న నెల్లూరులోని డీకెడబ్ల్యు కాలేజీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు మొత్తం 88 మంది హాజరుకాగా, అందులో 33 మందికి ఉద్యోగాలు లభించాయని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ తెలిపారు. ఉన్నత విద్యలు పూర్తిచేసుకున్న వారంతా ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.గిరి, ఎంప్లాయిమెంట్ అధికారి వినయ్‌కుమార్, జేడీఎం హైమావతి, స్కిల్ హబ్ ఇన్‌చార్జిలు డా.శ్రీరంజని, ఏ. ఉమాసుమాలిని పాల్గొన్నారు.

# 'సోమేపల్లి'పై రచనలు పంపండి

విజయవాడకు చెందిన కవి, జర్నలిస్టు, రెవెన్యూ అధికారి సోమేపల్లి వెంకటసుబ్బయ్య వర్ధంతి సందర్భంగా ప్రత్యేక సంకలనం ముద్రించనున్నామని, కవులు, రచయితలు సోమేపల్లితో ఉన్న అనుబంధాలను వ్యాసాలుగా, కవితలుగా రాసి పంపాలని ఆయన కుటుంబసభ్యులు ఒక ప్రకటనలో కోరారు. నవంబరు 20వ తేదీలోగా 80747 79202 నెంబరుకు వాట్సప్ ద్వారా రచనలు పంపాలని వారు విజ్ఞప్తి చేశారు.

## సభ్యత్వ నమోదులో..

# రూరల్‌ని నెంబర్-1గా చేద్దాం

## కార్యకర్తలకి కోటంరెడ్డి పిలుపు



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని నెంబర్ 1గా చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈనెల 22న ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన నియోజకవర్గ స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించి నాయకులతో మాట్లాడారు. సభ్యత్వ నమోదును ఒక సవాల్‌గా తీసుకుని ముమ్మరంగా నిర్వహించాలని చెప్పారు. ప్రతి నాయకుడు ఇందులో



భాగస్వామి కావాలన్నారు. ఇకనుంచి తన కార్యాలయంలో ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు కార్యకర్తల కోసమే అందుబాటులో ఉంటానని, వారికేమైనా సమస్యలుంటే తనకు నేరుగా చెప్పుకోవచ్చని అన్నారు. తనకు కార్యకర్తలే బలమన్నారు. వారే తనను అక్కున చేర్చుకున్నారని అంటూ, వారి బలంతోనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా నూటికి నూరుశాతం స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. తనను నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరిన కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలందరినీ గౌరవంగా చూసుకుంటామన్నారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ టీచర్ల సమస్యలు తీర్చండి

## --- యుటిఎఫ్ ఆందోళన ---




మునిసిపల్ టీచర్ల సమస్యలు తీర్చాలంటూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 22న నెల్లూరులోని డీఇఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరరావు మాట్లాడుతూ, పండిట్‌లు, పీఇటీల పోస్టులను అన్ని యాజమాన్యాల వారు అప్‌గ్రేడ్ చేసినా, మునిసిపల్ పాఠశాలల్లో మాత్రం ఇంకా అప్‌గ్రేడ్ చేయకపోవడం దారుణమన్నారు. అదేవిధంగా, అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు, ప్రధానోపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. యుటిఎఫ్ నాయకులు శేషులు, చలపతిశర్మ, అచ్యుయ్య, మురళీధర్‌రావు, నాగిరెడ్డి, సురేంద్రబాబు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మైపాడుగేటు వద్ద..మద్యం షాపు వద్దు

నెల్లూరులోని మైపాడుగేటు వద్ద మద్యం షాపు వద్దంటూ అక్కడున్న శ్రీనివాసనగర్ వాసులు ఈనెల 22న ఆందోళన చేపట్టారు. ఇళ్ళ మధ్య మద్యం షాపు ఉండడంతో ఇబ్బందులు వస్తున్నాయని, అధికారులు స్పందించి ఆ షాపును అక్కడినుంచి తొలగించాలని వారు కోరుతున్నారు. ఆమేరకు వారు కలెక్టర్ ఆనంద్‌కు కూడా వినతపత్రం అందజేశారు.

# లక్ష దీపోత్సవానికి అంకురార్పణ

## • భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ఏటా కార్తీక మాసంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల సహకారంతో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక మాస లక్ష దీపోత్సవానికి సోమవారం నెల్లూరు నగరంలో అంకురార్పణ జరిగింది. గత ఏడాదికంటే మరింత వైభవోపేతంగా ఈసారి కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నవంబర్ 8, 9, 10వ తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌సీ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రశాంతిరెడ్డి పాల్గొని భూమిపూజ చేశారు. అనంతరం, గుంజ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కర్‌శర్మ, విజయసారధి, సునీల్‌కుమార్, అర్చకులు పవన్‌స్వామి, నాగేంద్రకుమార్, తిరుపాల్‌రెడ్డి, రాము, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చలమయ్య పాల్గొన్నారు.

# రాజరాజేశ్వరమ్మవారికి భారీగా హుండీ ఆదాయం

## • శరన్నవరాత్రి వేడుకల్లో 93.77 లక్షల రాబడి



నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానానికి భక్తుల సంఖ్య, భక్తుల ద్వారా వస్తున్న కానుకల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఇటీవల అంగరంగవైభవంగా చేపట్టిన శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు వేలసంఖ్యలో తరలిరావడం తెలిసిందే. ఈ ఉత్సవాల రోజుల్లో నిత్యం 30వేల మందికి పైగానే అమ్మవారిని దర్శించుకున్నారని అంచనా. దీంతో, అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయం కూడా గతంలో కంటే బాగా పెరిగింది. ఈనెల 21న ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది 79,05,873 రూపాయల ఆదాయం రాగా, ఈ ఏడాది 93,77,164 రూపాయలు వచ్చిందని, ఇది గత ఏడాది కంటే 14,71,291 రూపాయలు అధికమని చెప్పారు. ఉత్సవాలకు సహకరించిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు, జిల్లా అధికార యంత్రాంగానికి, ఆలయ కమిటీవారికి ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# క్రీడా విజేతలకు అభినందనలు



నెల్లూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిపాలన భవనంలో ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఇంటర్-కాలేజియేట్ గేమ్స్ టోర్నమెంట్‌లో మేన్ గేమ్స్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ కేటగిరీలో రన్నర్లుగా నిలిచిన పి.హేమంజనేయులు (మెరైన్ బయాలజీ విభాగం), ఎ.శ్రీనివాసరావు(కెమిస్ట్రీ విభాగం)లను అభినందించారు. క్రీడలు విద్యార్థుల మానసిక మరియు శారీరక అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, సమష్టి విధానాన్ని మెరుగుపరుస్తాయని, రన్నర్‌గా నిలిచిన విద్యార్థులు తమదైన గుర్తింపు సాధించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ డాక్టర్ సిహెచ్. వెంకటరాయలు, విశ్వవిద్యాలయ పీడీ డాక్టర్ పి. ప్రవీణ్‌కుమార్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.




## 27న అష్టలక్ష్మి మందిరంలో..

# సంకీర్తన, వక్తృత్వ పోటీలు

శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 27న నెల్లూరు దర్గామిట్టలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న అష్టలక్ష్మి ఆలయంలో విద్యార్థులకు సంకీర్తనలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య నామసంకీర్తన పోటీలు, 4నుంచి7వ తరగతి విద్యార్థులకు 'పురాణంలో భగవంతుడు-గురురూప అవతారాలు' అనే అంశంపై పోటీలుంటాయని, 8 నుంచి 10 తరగతులవారికి 'పురాణాలు స్మృతుల ప్రకారం ధర్మం, భక్తి, జ్ఞానం అనగా ఏమిటి?.. నేటి సమాజంలో వాటి ఆవశ్యకత' అనే అంశంపై పోటీలుంటాయని తెలిపారు.

# నిధుల విడుదలకు..'హడ్కో' గ్రీన్‌సిగ్నల్

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న 165 కోట్ల విడుదలకు హడ్కో అంగీకారం తెలిపింది. ఢిల్లీలో హడ్కో అధికారులతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ సంప్రదింపులు జరపడంతో నిధుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దీంతో గత ప్రభుత్వహయంలో నెల్లూరు నగరంలో పెండింగ్‌లో పడిపోయిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా తదితర పనులకు మోక్షం కలిగినట్లే!.. త్వరలోనే అవి ప్రారంభం కానున్నాయి.



- మంత్రి నారాయణ చొరవ
- పెండింగ్ పనులకు.. ఇక మోక్షం కలిగినట్లే..

నెల్లూరు నగరాభివృద్ధి కోసం హడ్కో నిధుల మంజూరుకు మంత్రి నారాయణ ఇటీవల ఢిల్లీకి వెళ్ళి అక్కడి హడ్కో సీఇఓ సంజయ్ కల్‌శ్రేష్ఠతో చర్చించారు. ఇప్పటికే నెల్లూరులో చాలావరకూ పూర్తయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళి మిగిలిన నిధులు కూడా విడుదల చేయాలని కోరారు... దీంతో గతంలో మంజూరు చేసిన 165 కోట్ల నిధుల విడుదలకు హడ్కో సీఈవో అంగీకారం తెలిపినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. గతంలో కూడా తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న డాక్టర్ పొంగూరు నారాయణ, అప్పట్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నెల్లూరు అభివృద్ధి కోసం హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (హడ్కో) ద్వారా 995కోట్ల రుణం మంజూరు చేయించారు. వీటిలో నెల్లూరులో తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ కోసం 475 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం కోసం 520 కోట్లు హడ్కో రుణం ఇచ్చింది. 830 కోట్ల నిధులను విడుదల చేసింది కూడా. కానీ ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మిగిలిన మరో 165 కోట్లు విడుదల కాలేదు.. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధులు విడుదల కావడం విశేషం!

# శ్రీసిటీలో అలరించిన.. హరికథా గానం



శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో ఈనెల 20న టీటీడీకి చెందిన ప్రముఖ హరికథా విద్వాంసుడు 'హరికథా దురంధర' బిరుదాంకితుడు వై.వెంకటేశ్వర్లు భాగవతార్ ఆలపించిన 'పద్మావతి పరిణయం' హరికథా గానం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. కథనానికి పాటలను జోడించి అద్భుతమైన హావభావాల మేళవింపుతో శ్రీనివాసుడు- పద్మావతిదేవి వార్ల వివాహాన్ని ఆయనెంతో ఆసక్తికరంగా, అనర్గళంగా వివరించాడు. తిరుమల-తిరుపతి ప్రాముఖ్యతను, కలియుగ ప్రత్యక్ష దైవమైన ఆ శ్రీనివాసుని ప్రాశస్త్యాన్ని వివరించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు రెడ్డి శంకర్ (తబలా), ఎస్.మురళి (కీబోర్డు), జి.శ్రీనివాసులు (శృతి), విజయచంద్ర (రిథమ్ ప్యాడ్‌పై) సంగీత నైపుణ్యం ఈ కార్యక్రమాన్ని మరింత రక్తి కట్టించింది. భాగవతార్ వెంకటేశ్వర్లు, సహచర కళాకారుల అత్యుత్తమ ప్రదర్శనను కొనియాడిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వారిని జ్ఞాపికలతో సత్కరించారు. శ్రీసిటీ పీఆర్ఓ పల్లేటి బాలాజీ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. శ్రీసిటీ, పరిశ్రమల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కృషితోనే ఉన్నత శిఖరాలు

కృషి, పట్టుదలతోనే ఎవరైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, అందుకు కష్టపడి విద్యలో రాణించాలని, జిల్లా యూత్ ఆఫీసర్ డా. మహేంద్రరెడ్డి చెప్పారు. జిల్లా యువజనశాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న బుజబుజనెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కలిగించారు.



## టిడ్కో ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన

# అజయ్‌కు.. మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు

ఏపీ టిడ్కో ఛైర్మన్‌గా వేములపాటి అజయ్‌కుమార్ ఈనెల 23వ తేదీ బుధవారం గుంటూరులోని టిడ్కో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.




## ఏబీఆర్ఎస్ఎం విభాగాల..

# అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంఘం (ఏబిఆర్ఎస్ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ప్రతినిధుల సభ ఇటీవల ఒంగోలులో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం, ఏబీఆర్ఎస్ఎం డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షులుగా డాక్టర్ డిఎస్‌వి ఎస్ బాలసుబ్రహ్మణ్యం (ఎస్ఆర్ఆర్ అండ్ సీవిఆర్ డిగ్రీ కళాశాల, విజయవాడ), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కాశిబాబు(డాక్టర్ కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాచర్ల), ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షులుగా ప్రొఫెసర్ సి.శశిధర్ (జేఎన్టీయూ, అనంతపురం), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ప్రొఫెసర్ ముప్పాళ్ళ లక్ష్మణరావు (ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ, కందుకూరు), ఇంటర్మీడియట్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షులుగా బి.శరత్‌చంద్రశేఖర్ (ప్రభుత్వ జూనియర్ కాలేజీ బొమ్మసముద్రం, చిత్తూరు జిల్లా), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎం.వి నరసయ్య (ప్రభుత్వ జూనియర్ కళాశాల పెద్ద పప్పూరు, అనంతపురం జిల్లా)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.రంగనాథ్ పాల్గొన్నారు.







# క్రీడారంగానికి త్వరలోనే పూర్వవైభవం

## - శాప్ ఛైర్మెన్ రవినాయుడు



క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేస్తోందని గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన క్రీడా రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో త్వరలోనే పూర్వ వైభవం వస్తుందని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మెన్ రవినాయుడు భరోసానిచ్చారు. జిల్లాలోని మొఘళ్లపాలెంలో జరుగుతున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను, నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంను ఆయన ఇటీవల పరిశీలించారు. తొలుత మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పనులను పరిశీలించి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, త్వరలోనే ఇండోర్ స్టేడియంను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. 2017లో నాటి మాజీ కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు కోరిక మేరకు అప్పటి ప్రభుత్వం 150 ఎకరాల భూమిని మల్టీపర్పస్ క్రీడా వికాస కేంద్రం కోసం కేటాయించిందని, రూ. 8కోట్లతో నిర్మాణాలను చేపట్టి సుమారు 90శాతం పనులను కూడా పూర్తి చేసిందన్నారు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం క్రీడారంగాన్ని పట్టించుకోలేదని, దాంతో గత అయిదేళ్ళుగా రాష్ట్రంలోని క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు, స్టేడియంల నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయనున్నామన్నారు. 2027లో నేషనల్ గేమ్స్‌ను మన రాష్ట్రంలోనే నిర్వహించాలనే దృఢసంకల్పం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఉందని, అందుకు తగ్గట్టుగానే అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసేలా క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ, క్రీడారంగంలోని సమస్యల పరిష్కారానికి శాప్ కృషి చేయాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం క్రీడా రంగాన్ని పూర్తిగా విస్మరించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాప్ ఛైర్మన్‌గా రవినాయుడుకి బాధ్యతలు అప్పగించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# రామలింగేశ్వరునికి.. సోమిరెడ్డి దంపతుల పూజలు

మనుబోలు మండలం బద్దెవోలులో ఉన్న కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవాలయాన్ని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి జ్యోతి ఈనెల 21న దర్శించుకున్నారు. ఆలయంలో విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. సోమిరెడ్డి కుమారుడు రాజగోపాల్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, ఎస్ సురేంద్రరెడ్డి, నిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కందాటి దశరథరామిరెడ్డికి 'అనాలసిస్ ఆఫ్ ఫెడరేటెడ్ లెర్నింగ్' అనే అంశంపై డాక్టరేట్ లభించింది. డాక్టర్ ఎం. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు వేలూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి. విజయ్‌కుమార్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ. రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఆయన్ను అభినందించారు.

# ఎన్‌బికెఆర్‌లో.. 'ఇండస్ట్రియల్ రోబోటిక్స్'పై శిక్షణ




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇండస్ట్రియల్ రోబోటిక్ కంట్రోల్ అండ్ ప్రోగ్రామింగ్‌పై బెంగళూరు చెందిన డే ఫ్యాక్టో కంపెనీకి చెందిన ఇంజనీర్లు అయిదు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులను సోమవారం కళాశాల సంచాలకులు డాక్టర్ వి. విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పరిశ్రమల్లో రోబోటిక్స్ ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని, అందువల్ల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కంపెనీకి చెందిన ఇంజనీర్ నందగోపాల్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో పరిశ్రమలు డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ వైపు అడుగులు వేస్తున్నాయని, అందువలన రోబోటిక్స్‌పై మంచి అవగాహన ఉన్న మెకానికల్ విద్యార్థులకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మరొక ఇంజనీర్ ప్రోమీత్‌కుమార్‌పాత్ర మాట్లాడుతూ, మెకానికల్ విద్యార్థులకు మల్టీ డొమైన్ స్కిల్స్ ఎంతో అవసరమన్నారు. మెకానికల్ విభాగంలో ప్రస్తుత పారిశ్రామిక రంగానికి కావలసిన అన్ని సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని వినియోగించుకోవాలని కోరారు. విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ, గత సంవత్సరం డేఫ్యాక్టో కంపెనీ ద్వారా మన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని, అందువల్ల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ ప్రమోద్‌కుమార్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.




# కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు

## - ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, పాశిం సునీల్

కూటమి విజయాన్ని జీర్ణించుకోలేక వైకాపా నాయకులు దుర్మార్గాలకు పాల్పడుతున్నారని, తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఓపికను పరీక్షించవద్దని సర్వేపల్లి, గూడూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. చిల్లకూరు మండలం నాంచారంపేటకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త హరిప్రసాద్ భౌతిక కాయానికి గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో కలసి ఎమ్మెల్యేలు, నాయకులు ఈ నెల 22న నివాళి అర్పించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వైకాపా నాయకులు అరాచకాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోమని తెలిపారు. వైకాపా పాలనలో అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ని అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని ధ్వజమెత్తారు.



## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

హరిప్రసాద్ కుటుంబానికి రూ. 5 లక్షలు అందజేస్తామని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, నాయకులు తానంకి నానాజీ, భాస్కర్‌రెడ్డి, చెంచు రామయ్య, శ్రీనివాసులు, నాగరాజు, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పటిష్టంగా లింగ నిర్ధారణ చట్టం



గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, తద్వార భ్రూణహత్యలను నివారించవచ్చని సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ తెలిపారు. ఇటీవల గూడూరులోని సబ్‌కలెక్టర్ ఛాంబర్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై డివిజన్ స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ... సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత ఉండకూడదని తెలిపారు. ప్రతినెల అన్ని స్కానింగ్ కేంద్రాలను డాక్టర్లు తనిఖీలు నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్న స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ తొలగించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసినవారు 102, 104 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. లింగ నిర్ధారణ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను మీనన్ ఆదేశించారు.



## డాక్టర్ జనార్ధన్‌రెడ్డి

# పుట్టినరోజు వేడుకలు

ప్రముఖ ప్రజా డాక్టర్ జనార్ధన్‌రెడ్డి 70వ జన్మదిన వేడుకలు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘ సభ్యుల సమక్షంలో ఇటీవల ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల డాక్టర్‌గా పేరు పొందిన జనార్ధన్‌రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఆయన భవిష్యత్‌లో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ కుమార్‌రెడ్డి, బండి ధనంజయరెడ్డి, నెలబల్లి సిద్ధారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, మూలి హరనాథ్‌రెడ్డి, ఆమంచెర్ల భాస్కర్ రెడ్డి, కిషోర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, హరనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జానకిరామ.. రామాయణం 36

- ఊటుకూరు జానకి రామారావు



ఏ ఆడుదీ నా వంటి కొడుకును కనకుండు గాక, వ్యర్థజన్ముడను నేను. లక్ష్మణా నేను కోపిస్తే అయోధ్యనేమిటి, సమస్త భూమండలాన్నే స్వాధీనమొనర్చుకొనగలను. కానీ, ఇది పరాక్రమం చూపే సందర్భం కాదు కదా!.

ఇలా అంటూ కంటినిండా నీరునింపుకొని దైన్యంతో ఇంకా ఏమీ మాట్లాడలేక అలాగే కూర్చుండిపోయాడు రాముడు.

విలపిస్తున్న రాముడిని ఓదార్చాడు లక్ష్మణుడు.

అన్నా నీవే ఇలా దిగులుపడితే నేనూ, వొదినగారూ ఏం కావాలి? నీవు దగ్గరలేక పోతే నేనుగానీ, సీతమ్మ కానీ నీటినుండి బయటకు తీసిన మత్స్యములమైపోతామయ్యా!

క్షణకాలం కూడా భూమిపై మనలేం.

శత్రుసంహారకుడవైన ఓ రామా! నిన్ను విడిచి నా తల్లి సుమిత్రను కానీ, శత్రుఘ్నుని కానీ, తండ్రిని కానీ ఆఖరికి అది స్వర్గమైనా కానీ నేను వెళ్ళను.

సర్వలోకాలను ఆనందింపచేయువారలలో శ్రేష్ఠుడైన రాముడు (రామో రమయతాం శ్రేష్ఠః) తమ్ముడి మాటలతో తేరుకొని మనస్సును దృఢం చేసుకొని వనవాసం పూర్తిగావిం చేందుకు సంకల్పించుకొన్నాడు.

అప్పుడు ఆ అన్నదమ్ములిరువురూ పర్వతచరియలపై నిర్భయంగా సంచరించే రెండు సింహాలలాగ ప్రకాశించారు.

రాత్రి గడిచి తెల్లవారింది. పక్షుల కిలకిలారావాలు, నెమళ్ళ క్రేంకారాలు, అడవికోడి కూతలతో అరణ్యంలో సందడిసందడిగా ఉంది. సీతారాములు నిదురలేచారు. మరల నడక సాగించారు.

కొంతదూరం వెళ్ళగానే వారికి పెద్దపెద్ద జలరాశులు కలుసుకున్న చప్పుడు వినపడ్డది. ఆ జలతరంగ ఘోషను శ్రద్ధగా ఆలకించారు. వారికి అర్థమయ్యింది అది గంగా యమునల సంగమక్షేత్రమని, అతి దగ్గరలోనే ప్రయాగ కలదనీ.

వారు నడుస్తున్న ప్రాంతంలో మనుషులచే విరవబడి నట్లుగా కఱ్ఱముక్కలు కనపడ్డాయి. తలెత్తి పరికించి చూశారు. దూరంగా పొగ ఆకాశంలోకి వెళుతూ కనపడ్డది.

ఉత్సాహంగా నడక సాగించారు. ఒక ఆశ్రమ పరిసర ప్రాంతాలలో తామున్నట్లు గ్రహించారు. అది భరద్వాజ మహర్షి ఆశ్రమం.

ఆశ్రమంలో అడుగు పెట్టగానే ధనుర్ధారులైన వారిని చూసి ఆశ్రమంలోని మృగాలు భయపడ్డాయి.

వారు ముఫ్వురూ శిష్య గణంతో శోభిల్లుతున్న భరద్వాజ మహర్షికి వినయంగా నమస్కారాలు చేసి తమను తాము పరిచయం చేసుకున్నారు.

మహర్షీ నన్ను రాముడంటారు, దశరథమహారాజు పుత్రుడను, ఈ కల్యాణి సీత జనకరాజపుత్రి, అనిందిత, నా సహధర్మచారిణి.

ఈతడు నా సోదరుడు లక్ష్మణుడు, నా తండ్రి నన్ను అరణ్యాలకు పంపగా తనంతతానే నన్ను అనుసరిస్తూ వస్తున్నాడు.

మహర్షీ! నా తండ్రి ఆజ్ఞమేరకు మేం అరణ్యవాసం చేస్తూ కందమూల ఫలములు స్వీకరిస్తూ కాలం గడుపుతాం అని పలికిన రాముని చూసి... రామా! నీ గురించి అంతా విన్నాను.

ఎంతో కాలానికి మా ఆశ్రమానికి వచ్చావు, మా ఆతిథ్యం స్వీకరించు అని మధుర ఫలరసాలతో కూడిన కమ్మని ఆహారం (తాపసులు భుజించేది, అరణ్యంలో లభ్య మయ్యేవి) వారికి అందచేసి వారుండటానికి బస ఏర్పాటు చేశాడు భరద్వాజ మహర్షి.

మరల రాత్రి రానే వచ్చింది. ఎంతో దూరం నడచిన అలసట వల్ల సీతారాములు గాఢంగా నిదురించారు.

ఆ రాత్రి తెల్లవారిన పిదప రాముడు మహర్షి వద్ద సెలవు తీసుకొని మహర్షి సూచించిన చిత్రకూటపర్వతం వైపు నడక సాగించారు. ఆ పర్వతం మనోహరమై ఉండి క్రూరమృగ బాధలేని, తాపసులు నివాసముండే ప్రాంతం. అక్కడికి పది క్రోసుల దూరంలో ఉంది.

అంతకుముందు భరద్వాజుడు తన ఆశ్రమంలోనే వనవాసం పూర్తి చేసుకొమ్మని చెప్పినప్పటికీ అది తమ కోసల ప్రజలు తేలికగా రాదగ్గ ప్రాంతం కావున సున్నితంగా వలదని, అనువైన ప్రదేశం చిత్రకూటమని తెలుసుకొని ఆ దిశగా శ్రీరామ ప్రయాణం సాగింది.

చిత్రకూటానికి ప్రయాణమయ్యారు సీతారామలక్ష్మ ణులు. వారివెంట భరద్వాజ మహర్షి కూడా దారిచూప డానికి వెంట కొంతదూరం ప్రయాణించాడు.

రామా! ఈ మార్గంలో నేను చాలాసార్లు చిత్రకూటానికి వెళ్ళాను. ఇది ఏ విధమైన ఇబ్బందులు కలుగని మార్గం.

ఇక్కడనుండి గంగాయమునల సంగమప్రదేశానికి వెళ్ళండి, అక్కడ నుండి పడమటి దిక్కుగా యముననే అనుసరిస్తూ వెళ్ళండి.

అలా ప్రయాణించిన తరువాత కాళిందిని తెప్ప నిర్మించు కొని దాటండి. దాటినపిమ్మట మీకు శ్యామం అనే అతివిశాల మైన మఱ్ఱిచెట్టు కనపడుతుంది. ఆ వృక్షాన్ని ఆశ్రయించి అనేకమంది సిద్ధులుంటారు. అక్కడ సీత ఆ వృక్షానికి నమస్క రించి కావలసిన కోరికలు కోరవచ్చును.

ఆ పెద్ద మఱ్ఱిచెట్టు దాటి ముందుకు ఒక క్రోసు దూరం వెళ్ళండి, అక్కడ చక్కటి నీలపురంగులో ఉండే అడవి కనపడుతుంది. అది మోదుగుచెట్లతోనూ, రేగుచెట్లతోనూ, వెదురుడొంకలతోటి కూడి రమణీయంగా ఉంటుంది.

ఆ మార్గమే చిత్రకూటానికి వెళ్ళే మార్గం. ఈ విధంగా మహర్షి మార్గనిర్దేశం చేసి తాను రాముని కోరికమీద వెనుకకు మరలినాడు.

ముఫ్వురూ యమునాతీరం చేరారు. యమున ప్రవాహ వేగం మంచి ఉధృతంగా ఉంది. దానిని ఎలా దాటాలా అని కాసేపు ఆలోచించి, చకచకా కొన్ని ఎండిన కఱ్ఱలు, వెదురుకఱ్ఱలు సేకరించి వాటన్నిటినీ దగ్గరగా చేర్చి కట్టి ఒక తెప్ప తయారుచేసుకొన్నారు.

లక్ష్మణుడు రకరకాలచెట్ల కొమ్మలు తీసుకొని వచ్చి సీత సుఖంగా కూర్చోవడానికి వీలుగా ఒక ఉన్నతమైన ఆసనం సిద్ధం చేశాడు.

ఆ తెప్పమీదికి ఎక్కడానికి కాస్త సిగ్గుపడుతున్న సీతమ్మకు చేయూత నిచ్చి ఎక్కించాడు రామచంద్రుడు. మూటకట్టిన సీత ఆభరణాలు, గునపము, మేకతోలుతో చేసిన చిన్నపెట్టెను, ఆయుధాలను సీత ప్రక్కనే ఉంచాడు రాఘవుడు.

ఇరువురు అన్నదమ్ములూ తెడ్లేసుకుంటూ దానిని నడుపసాగారు. సూర్యపుత్రిక అయిన ఆ నది మధ్యభాగంలోకి వెళ్ళగనే సీతమ్మ మరల మొక్కులు మొక్కుకుంది.

అమ్మా రాముడు క్షేమంగా తిరిగి అయోధ్యకు రాగానే నీకు వేయి గోవులు సమర్పించుకుంటానమ్మా అని నదీమ తల్లికి మొక్కులు మ్రొక్కింది.

ప్రయాణించి వచ్చిన తెప్పను అక్కడే వదిలివేసి మరల నడకసాగించారు. వనాల గుండా ప్రయాణం చేస్తూ శ్యామం అనే మఱ్ఱిచెట్టు వద్దకు వచ్చి చేరారు.

ఆ మఱ్ఱిచెట్టు చుట్టూ సీతమ్మ మరల ప్రదక్షిణం చేసి తన భర్త నిర్విఘ్నంగా వనవాస వ్రతం పూర్తిచేయాలని కోరికలు కోరింది.

మరల నడక మొదలుపెట్టారు. లక్ష్మణుడు ముందు తరువాత సీతమ్మ ఆవెనుక ధనుర్ధారియై రామయ్య.

దారిలో ఏదైనా అందమైన పొదగానీ, పువ్వుగానీ కనపడినప్పుడు రామచంద్రుని దాని విశేషమడుగుతూ ఆయన చెపుతూ ఉంటే ఈవిడ చిన్నపిల్లలాగా ఆనందిస్తూ ముందుకు సాగుతోంది.

వదినగారు ఏ పూవును, పండును అయితే చూసి విశేషమడిగారో వాటిని సేకరించి మరిది లక్ష్మణుడు తీసుకొని వచ్చి ఆమెకివ్వటం... ఇలా సాగుతోంది వారి ప్రయాణం.

రాత్రి గడిచింది. అందరికన్నా ముందుగా రాముడు నిద్దుర లేచాడు. ప్రక్కకు తిరిగిచూస్తే తమ్ముడు ఇంకా నిద్దురపోతూనే కనిపించాడు.

సోదరుడిని మెల్లగా తట్టి నిద్రలేపాడు. లక్ష్మణా! వనంలో సంచరించే ప్రాణుల ధ్వనులు ఎంత మధురంగా ఉన్నాయో విను. ఇది మరల మనం బయలుదేరే సమయం, త్వరగా ప్రయాణం సాగించాలి.

అన్నగారి చేత మేలుకొలుపబడ్డవాడయిన లక్ష్మణుడు నిద్రను, బద్ధకాన్ని వదిలించుకొని లేచి యమునలో స్నానం చేసి ప్రయాణ సన్నద్ధుడైనాడు. భరద్వాజ మహర్షి చెప్పిన మార్గాన్ని అనుసరిస్తూ చిత్రకూటం వైపు సాగిపోయారు.

.. (సశేషం)

## శ్రీసిటీ-ఆక్సిలెంట్ ఫార్మా పరిశ్రమకు..

# 'హెల్త్ కెనడా' సర్టిఫికెట్



శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ఇటీవల ప్రతిష్టాత్మకమైన 'హెల్త్ కెనడా కరెంట్ గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' సర్టిఫికెట్ లభించింది. కంపెనీ నాన్-స్టైరైల్ సదుపాయం కోసం ఈ గుర్తింపు అందుకుంది. 'హెల్త్ కెనడా' అనేది ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ, ఆహార ఉత్పత్తులకు సంబంధించి భద్రత, నాణ్యత నిర్ధారించే మార్గదర్శకాలను రూపొందించే సంస్థ. ఆ సర్టిఫికెట్‌ను అందించే ఈ సంస్థ ఈ ఏడాది సెప్టెంబర్16-20తేదీల మధ్య పరిశ్రమను సందర్శించి నాణ్యత తనిఖీలు నిర్వహించింది కూడా. ఈ విశిష్టమైన సర్టిఫికెట్ పొందడం తమకెంతో సంతోషంగా ఉందంటూ ఆక్సిలెంట్ ఫార్మా కంపెనీ ఛైర్మన్ జితేష్ దేవేంద్ర పేర్కొన్నారు. తమ కంపెనీ నాన్-స్టైరైల్ సదుపాయంలోని ఓరల్ సాలిడ్, ఓరల్ లిక్విడ్, సెమి సాలిడ్ ఉత్పత్తులకు సంబంధించి ఈ తనిఖీలు జరిగాయని చెప్పారు. గతంలో తమ ఇతర ఉత్పత్తులకు సంబంధించి యుఎస్ ఎఫ్‌డీఏ తనిఖీలు చేపట్టి సర్టిఫికెట్ అందజేసినట్లు, వచ్చే ఏడాది తమ స్టైరైల్ సదుపాయానికి సంబంధించి కూడా విజయవంతంగా తనిఖీలు పూర్తవుతాయని, ఇది తమ కంపెనీ నాణ్యతకు, నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.






# బాబుకి దగ్గరగా వై.యస్. వర్గం

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కడైనా ఎదురుపడినప్పుడు ఒకరినొకరు నవ్వుతూ పలకరించుకునేవారు. రాజకీయ రణరంగంలో మాత్రం ఆజన్మశత్రువులుగా పోరాడుకునేవారు. రాజశేఖరరెడ్డితో పాటుగా ఆయనకి కుడి భుజం ఎడమ భుజంగా ఉన్న ఆయన మిత్రులు, అనుచరులు, అనుయాయులు కూడా చంద్రబాబుని తమ రాజకీయ విరోధిగా చూసేవారు. అంతటి స్థాయిలో వై.ఎస్. – బాబుల మధ్య యుద్ధం కొనసాగేది. అలాంటి వారంతా ఇప్పుడు వై.ఎస్. రాజకీయ వారసుడు జగన్‌మోహన్‌రెడ్డికి దూరంగా జరుగుతున్నారు. క్రమేణా బాబుకి, ఆయన బృందానికీ దగ్గరవుతున్నారు.

## ఇద్దరూ ఒకేసారి శాసనసభ్యులై మంత్రులయ్యారు!

1978లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి, చంద్రబాబునాయుడు ఒకేసారి ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1980లో టీ.అంజయ్య క్యాబినెట్‌లో ఇద్దరూ ఒకే సమయంలో మంత్రులుగా కూడా పనిచేశారు. అప్పట్లో చంద్రబాబు మంత్రి కావడానికి పరోక్షంగా రాజశేఖరరెడ్డి చాలా సహాయం చేశారని కూడా వై.ఎస్. సన్నిహితులు పలు సందర్భాలలో చెప్తుంటారు. అయితే, చంద్రబాబు కాంగ్రెస్ ప్రభుత్వంలో సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్న తరుణంలోనే నందమూరి తారక రామారావు కుమార్తె భువనేశ్వరిని 1981 సెప్టెంబర్‌లో పెళ్లాడారు. 1982లో రామారావు రాజకీయ రంగప్రవేశం చేసి తెలుగుదేశం పార్టీని స్థాపించడం చంద్రబాబుకి కలిసొచ్చింది. 1983 ఎన్నికలలో ఆయన కాంగ్రెస్ తరఫునే పోటీ చేసి ఓడిపోయి, ఆ తరువాత మామ పార్టీ పంచన చేరారు. అక్కడినుండే ఆయన దశ మారిపోయింది. చంద్రబాబు టీడీపీలో చేరడాన్ని డాక్టర్ రాజశేఖరరెడ్డి తప్పు బట్టారు. చంద్రబాబుది ఏరుదాటి తెప్పతగలేసే మనస్తత్వమని తెగేసి చెప్పారు. కాంగ్రెస్‌ని వీడిన బాబుని తీవ్రంగా దుయ్యబట్టారు. అక్కడినుండే వీరిద్దరి రాజకీయ వైరం మొదలయ్యింది. ఆ తరువాత అనూహ్యంగా 1995 ఆగస్టు నుండి 2004 వరకు సుమారు తొమ్మిదిన్నర ఏళ్ళపాటు చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1999 – 2004 మధ్యకాలంలో బాబు సీఎంగా, వై.ఎస్ ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభలో వీరిద్దరి రాజకీయ వైరం మరింత ముదిరి పతాకస్థాయికి చేరింది.

2004లో, 2009లో వరుసగా చంద్రబాబుని ఓడించి ప్రతిపక్షంలో కూర్చోపెట్టారు రాజశేఖరరెడ్డి. అయితే, విధివశాత్తు రెండవసారి అధికారంలోకి వచ్చిన వందరోజులలోపే రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో ఆకస్మిక మరణం పొందారు. వై.ఎస్. మరణంతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. ఉమ్మడి రాష్ట్రం రెండుగా చీలిపోయింది. ఆంధ్ర అనాథగా మారిపోయింది.

## నాన్న వర్గాన్ని నిలుపుకోలేక పోయిన జగన్!

రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడిగా రాజకీయాలలోకి వచ్చిన జగన్.. ఏ విధంగానూ తండ్రిని మరపించలేక పోయారు. 2009 నుండి 2019 వరకూ పదేళ్ళ సుదీర్ఘ పోరాటం తరువాత చరిత్రాత్మక రీతిలో 151 సీట్లతో విజయం సాధించాడు జగన్. తన అయిదేళ్ళ పరిపాలనా కాలంలో అటు ప్రజలు, ఇటు తన నాన్న అభిమానులతో పాటు తల్లి, చెల్లితో సహా సొంత కుటుంబసభ్యులని కూడా మెప్పించలేకపోయాడు. తల్లి విజయమ్మ పార్టీకి రాజీనామా చేసేశారు. ఎన్నికల సమయంలో రాజకీయాలకి దూరంగా అమెరికాకి వెళ్లిపోయారు. చెల్లి షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టి నవ్వులపాలై, ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరి ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా 2024ఎన్నికలలో అన్నతో నేరుగానే తలపడ్డారు. 2019లో జగన్ ఎంత ఘనంగా గెలిచాడో 2024లో అంతే ఘోరంగా ఓడిపోయి 11 సీట్లకి పరిమితమయ్యాడు. కూటమి నేతృత్వంలోని తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. మొన్నటి వరకు లోలోపల జగన్‌కి మద్దతు తెలిపిన ఢిల్లీ కమలదళం ఇప్పుడు నేరుగా బాబుతోనే చేయికలిపి దోస్తీ చేస్తోంది. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడి ఇంకా అయిదు నెలలు కూడా కాలేదు. అప్పుడే "మళ్ళీ గెలిచేది మనమే.. అందరిని ఏరి ఏరి లోపలపెడతా" అని జగన్ సవాలు విసురుతున్నారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని అంటూ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ కటకటాల వెనక్కి పంపే ప్రయత్నంలో బాబు ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇదే క్రమంలో జరుగుతున్న రాజకీయ డ్రామాలో రాజశేఖరరెడ్డి కుటుంబం బజారునపడింది.

## వీధికెక్కిన ఇంటి పోరు!

చాన్నాళ్ళుగా అంతర్గతంగా సాగిన వై.ఎస్. కుటుంబ ఆస్తి పోరు ఇప్పుడు ఒక్కసారిగా రచ్చకెక్కింది. అన్నాచెల్లెళ్ళ మధ్య అధికార, ఆధిపత్యపోరు మాత్రమే నడుస్తోందని ఇన్నాళ్ళూ భావించిన రాజన్న అభిమానులు, ఆంధ్ర ప్రజలూ ఖంగుతినేలా ఆ కుటుంబం ఆస్తి తగాదాలతో అభాసుపాలయ్యింది. ఆస్తి పంపకాలలో భాగంగా తన అమ్మ, చెల్లెళ్ళకి తాను చేసిన షేర్ల బదిలీని రద్దు చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి ఎన్.సీ.ఎల్.టీ(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)ని ఆశ్రయించడం పెనుదుమారాన్ని లేపింది.

జగన్ అభ్యర్థనకి ధీటుగా స్పందిస్తూ... 'ఇదేం న్యాయం జగనన్నా' అంటూ తన తల్లి విజయమ్మ సంతకంతో సహా షర్మిల రాసిన ఉత్తరం వై.ఎస్. కుటుంబ పరువుని బజారునపెట్టింది. ఈ క్రమంలో జగన్‌మోహన్‌రెడ్డికి తన కుటుంబసభ్యులతో వున్న విభేదాలని తమకి అనుకూలంగా మార్చుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అరెస్టుకు భయపడే జగన్ అడ్డం తిరిగాడా?

జగన్ బెయిల్ రద్దు చేయించాలనే తలంపుతో కూటమి నేతలు భారీ వ్యూహమే రచించినట్లు విశ్లేషకులు చెప్తున్నారు. అన్నపై చెల్లి షర్మిలకి ఉన్న వ్యతిరేకతను తమకి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు జరిగాయని రాజకీయవర్గాల అనుమానం. ఈ వ్యవహారాన్నంతా పసికట్టిన జగన్ చట్టపరంగా ఒకడుగు ముందుకేసి ఎన్.సి.ఎల్.టీని ఆశ్రయించాడని విశ్లేషకులు భావిస్తున్నారు.

## తన సొంత ఆస్తులలో కొంత వాటా చెల్లెలకు ఇచ్చిన జగన్

రాజశేఖరరెడ్డి బ్రతికున్నప్పుడే వారసత్వంగా వచ్చిన కొన్ని ఆస్తుల్లో జగన్‌కూ, షర్మిలకూ మధ్య పంపకాలు పూర్తయ్యాయి. వై.ఎస్. మరణం తరువాత సీబీఐ కేసులు, ఈడీ కేసులతో వైయస్ జగన్ సొంత కంపెనీలకి సంబంధించిన ఆస్తులు ఈడీ అటాచ్‌మెంట్లోకి వెళ్లాయి.

అటాచ్‌మెంట్‌లో వున్న ఆస్తులని వేరొకరికి బదిలీచేయడం కానీ, విక్రయించడం కానీ చట్ట విరుద్ధం. దీన్ని దృష్టిలో ఉంచుకుని, తన చెల్లెలితో ఉన్న అనుబంధం దృష్ట్యా, ప్రేమకొద్దీ తాను సొంతంగా సంపాదించిన ఆస్తుల్లో కొన్నింటిని చెల్లెలికి ఇవ్వాలని జగన్ భావించారు. కేసుల్లో ఆస్తులు ఉన్నందున వాటిని నేరుగా బదిలీచేయడానికి చట్టపరంగా ఆస్కారం లేదు కాబట్టి, తన చెల్లెలకు నమ్మకం కలిగేందుకు పరస్పరం అవగాహనా ఒప్పందాన్ని (MOU) జగన్ రాసుకున్నారు. ఇలా రాసిన ఆస్తుల్లో సరస్వతీ పవర్ కూడా ఒకటి.

## కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే ...

సరస్వతీ పవర్ కంపెనీలో 99శాతం షేర్లు జగన్‌కూ, 1శాతం షేర్లు విజయమ్మకూ ఉన్నాయి. సీబీఐ, ఈడీ కేసుల్లో భాగంగా ఈ ఆస్తి కూడా అటాచ్‌మెంట్‌లోకి వెళ్లిపోయింది. దీనిపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. తన చెల్లెలపై ప్రేమకొద్దీ రాసిన ఒప్పంద పత్రంలో సరస్వతీ పవర్‌లో కూడా వాటా ఇస్తానని జగన్ పేర్కొన్నారు. నేరుగా షర్మిలకు బదిలీ చట్టవిరుద్ధం కాబట్టి, నమ్మకం కోసం అప్పటికే 1శాతం వాటాదారుగా ఉన్న తల్లి విజయమ్మ షేర్లతో ముడిపెట్టి ఒప్పందం చేశారు. కేసులు తేలాక ఆ షేర్లను షర్మిల పేరుమీద బదిలీచేసుకోవచ్చని జగన్ ఈ గిఫ్ట్‌డీడ్‌ను 2019లో రాసిచ్చారు. కోర్టుకేసుల్లో, అటాచ్‌మెంట్‌లో ఉన్న ఆస్తిని నిర్వహించుకోవడానికే తప్ప ఏ రకంగానూ క్రయ, విక్రయాలు చేసుకోవడానికి వీల్లేని నేపథ్యంలో జగన్, ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారు.

## కోర్టుల్లో కేసులు.. విరుద్ధంగా షేర్ల బదిలీ

తర్వాత కాలంలో షర్మిలకు రాజకీయంగా ఆసక్తి పెరిగింది. రాజకీయంగా తాను కూడా ఎదగాలని ఆమె ప్రయత్నాలు మొదలుపెట్టారు. తెలంగాణలో పార్టీ మూసేశారు. తర్వాత హఠాత్తుగా అక్కడ నుంచి మకాం మార్చి ఏపీలో కాంగ్రెస్‌కు అధ్యక్షురాలు అయ్యారు. తదనంతరం జగన్‌ని రాజకీయంగా వ్యతిరేకించి, ఆయన్ను నిరంతరం ఇబ్బందులు పాలుచేసే వ్యక్తులతో సన్నిహిత సంబంధాలు నెరుపుతూ వచ్చారు. ఏకంగా జగన్‌నే టార్గెట్‌చేస్తూ పలు సందర్భాల్లో ఆమె మాట్లాడిన మాటలు రాజశేఖరరెడ్డి అభిమానులని ఆవేదనకు గురిచేశాయి. ఇదే సందర్భంలో సరస్వతీ పవర్‌లో జగన్ ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను ఆధారంగా చేసుకుని విజయమ్మ దగ్గరనుంచి షేర్లను షర్మిల తనకి బదిలీచేయించుకున్నారు.

## న్యాయవాదుల సూచనలతో జాగ్రత్తపడ్డ జగన్

కోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్న నేపథ్యంలో ఈ పరిణామం న్యాయపరంగా ఇబ్బంది తెచ్చిపెడుతుందని జగన్‌ను న్యాయవాదులు హెచ్చరించారు. దీన్ని ఆసరాగా తీసుకుని బెయిల్ రద్దుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు కూడా విశ్వసనీయ వర్గాల ద్వారా జగన్‌కు సమాచారం అందినట్టు కూడా విశ్లేషకుల అనుమానం. వై.ఎస్. వివేకా కుమార్తె సునీత ఇటీవల బాబుని కలిసిన సందర్భంలో ఈ అంశం కూడా చర్చకు వచ్చిందని అంటున్నారు. న్యాయవాదుల సూచనలతో తప్పనిసరి పరిస్థితుల్లో జగన్ బహిరంగంగా బయటపడాల్సి వచ్చింది. తన అరెస్టుని ఆపుకునే ప్రయత్నంలో ఇంటి గుట్టుని రట్టు చేయక తప్పలేదని విశ్లేషకులు అంటున్నారు.

ముప్పును ముందుగానే గుర్తించి జగన్ జాగ్రత్తపడ్డారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇలాంటి విషయాల్లో బంధుత్వాలపై మమకారం అంటూ నిర్లక్ష్యంచేస్తే జగన్ మళ్ళీ జైలుకి వెళ్ళవలసి వస్తుందని, అందుకే ఆయన ముందుగానే మేల్కొన్నారని అంటున్నాయి.

## బాబుకి దగ్గరవుతున్న వై.ఎస్ వర్గం

ఓ వైపు వై.ఎస్. కుటుంబ పరిణామాలు తీవ్ర వివాదాస్పదంగా మారుతున్న తరుణంలో వై.ఎస్. ఆత్మగా భావించే కేవీపీ రామచంద్రరావుతో సహా రాజశేఖరరెడ్డికి అత్యంత సన్నిహితంగా మెలిగిన వారంతా జగన్‌కి దూరమైపోతున్నారని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి. తనని విడిచివెళ్లే వారి విషయంలో జగన్ కూడా పెద్దగా స్పందించడం లేదని వారి అభిప్రాయం. పోతేపోనీ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఒక్క వై.వీ.సుబ్బారెడ్డి తప్ప రాజశేఖరరెడ్డి తరపు బంధువర్గంలో ఎవరూ జగన్‌తో లేరని అంటున్నారు. రాజకీయంగా కూడా రాజశేఖరరెడ్డి అనుయాయులుగా వున్నవారు తలో దారి చూసుకుంటున్నారని సమాచారం. జగన్ వైఖరి ఎవరికీ నచ్చకపోవడంతో, జగన్‌ని విభేదించి చంద్రబాబుకి దగ్గరవుతున్నారని రాజకీయవర్గాల అభిప్రాయం. ఇలాగే కొనసాగితే జగన్ చుట్టూ ఆ నలుగురు కూడా మిగలరని జోస్యం చెప్తున్నారు..!

# 'ఆనం'..ఓ మధుర జ్ఞాపకం

శ్రీశైల మహాక్షేత్రంలో పొన్నూరు శ్రీ భావనారాయణస్వామివారి దేవస్థానంవారిచే నిర్మించిన ధర్మశాలకు, శ్రీశైలం దేవస్థానాధికారులు నివసించేందుకు నిర్మాణం గావించిన భవనాలకు 1962 డిసెంబరు 18వ తేదీన ఆనాటి మంత్రులు.. విద్యుత్‌శాఖ, ఇరిగేషన్ మంత్రివర్యులు ఓవీ అలగేశన్ (కేంద్రమంత్రి), ఏసీ సుబ్బారెడ్డి (ఆంధ్రప్రదేశ్)లను కీర్తిస్తూ రచించిన ఆశీర్వాద పద్యాలు ఇవి. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల శ్రీశైల దేవస్థానాన్ని సందర్శించినప్పుడు అక్కడి నిర్వాహకులు నాటి **'ఆశీర్వాద పద్య రత్నములు'**ను ఆయనకు బహుకరించారు. అవే ఇవి!...

**సీ!! ఇప్పించితిరి కదా! ఇరువది లక్షలు 'ఘాటురోడ్డు'కు నిరాఘాటముగను**
**అర్పించితిరి కదా! ఆరులక్షల సొమ్ము పాతాళగంగను పయికి గొనగ**
**తెప్పించితిరి కదా! తేట విద్యుచ్ఛక్తి కటిక చీకటి బాప కరుణమీర**
**మెప్పించితిరి కదా! మేల్మి మంత్రులయందు భారత ప్రభుతలో ప్రతిభతోడ**
**ధర్మగుణశాలి పొన్నూరు ధర్మశాఖ పరగ తెరువంగవచ్చిన భద్రమూర్తి**
**సంతసము మాకు జేకూరె సద్గుణాఢ్య అలఘు మంత్రీశ! శ్రీయుత అల్లగేశ!**

**సీ!! శ్రీవనితాధవుండీ మంత్రివరులకు సిరి నెప్పుడును దయసేయు గాత**
**శ్రీ మేనకాత్మజాస్వామి మంత్రుల కెందు శాశ్వత తేజమ్మొసంగు గాత**
**శ్రీ భారతీశుడు నీ మంత్రివరులకు దీర్ఘాయువు నొసంగి తీర్చు గాత**
**శ్రీగిరి మల్లేశ శ్రీ భ్రమరాంబికల్ మంత్రిద్వయంబును మనుచు గాత**
**గీ!! సరసు నోలి శ్రీయలగేశు సత్యభాషు అలఘు ఏ.సి సుబ్బారెడ్డి యనఘ చరితు**
**సకల కామితములు దీర్చి సౌఖ్యమిచ్చి సర్వకాలంబు రక్షింత్రు సరసమతుల!...**

# నెల్లూరొస్తున్న.. బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి ఈనెల 25, 26 తేదీలలో నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణాను నిరోధించడం గురించి జిల్లాలో అమలవుతున్న విధానాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. 25వ తేది ఉదయం 10గంటలకు ఆమె నెల్లూరుకు వస్తారని, 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం, మళ్ళీ 3 గంటల నుండి 5 గంటల వరకు బీసీ, సాంఘిక సంక్షేమం, గిరిజన హాస్టల్ వార్డెన్స్ మరియు అధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. 26వ తేదీన విద్యాశాఖలోని అన్ని విభాగాల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో చర్చిస్తారని, మధ్యాహ్నం 3 గంటల నుండి స్థానికంగా ఉన్న ఆసుపత్రులను, సచివాలయాలను సందర్శిస్తారని తెలియజేశారు.

# 25 నుండి.. ఫిబ్రవరి 28 వరకు పశుగణన

జిల్లాలో అక్టోబర్ 25 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆమేరకు పశుసంవర్ధక శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. పశుగణన సిబ్బంది జిల్లాలోని ప్రతి గడపకు వచ్చి విషయసేకరణ గావిస్తారనీ, వారికి పశువుల సమగ్ర సమాచారం అందించాలని కోరారు. దేశమంతా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి పశుగణన జరుగుతుందని, గేదెలు, ఆవులు తదితరాల వివరాలన్నిటినీ నమోదు చేస్తారని ఈ సమావేశంలో పాల్గొన్న పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. పశువులు, పెంపుడు జంతువుల సమాచారం అందించి, తద్వారా పశు సంవర్ధకశాఖ పథకాల రూపకల్పనకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు సోమయ్య, ఎం.నాగమణి, రామచంద్రారెడ్డి, మంజునాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# చెరువులకు గండ్లు.. రైతుల కడగండ్లు

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఇటీవల భారీవానలు కురవడంతో ఇక సాగునీటికి కరువుండదని వరికుంటపాడు మండలం కనియంపాడులోని అన్నదాతలు సంతోషపడుతున్న సమయంలో ఆ గ్రామంలోని చెరువుకు గండ్లు పడడంతో ఉన్న నీరంతా వృధా అయిపోయాయి. చెరువు కట్ట బలహీనంగా ఉండడంతో కట్ట తెగిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా ఉదయగిరి మండలంలోని దాసరిపల్లి చెరువుకు కూడా గండిపడింది. దీంతో వర్షపు నీరంతా వెల్లువగా వచ్చి ఇళ్లన్నీ జలమయమయ్యాయి. సమయానికి మాజీ సర్పంచ్ సయ్యద్ జాఫర్ మొహిద్దీన్, స్థానిక టీడీపీ నాయకులు వచ్చి జేసీబీ పెట్టి గండిని పూడ్పించబట్టి సరిపోయింది కానీ, లేకుంటే ఆ నీరంతా కూడా వృధా అయి పోయి ఉండేవి. వర్షాల ధాటికి అనేక గ్రామాల్లో రహదారులు కూడా దెబ్బతిన్నాయి. వాటిని ఎప్పుడు బాగుచేస్తారో తెలియదు. కనియంపాడు- రామదేవులపాడు రోడ్డు బాగా దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయంగా ఉంది. కొండాపురం మండలంలోని కొమ్మి పంచాయతీలో ఉన్న గండికట్ట చెరువుకు కూడా గండిపడింది, కానీ అధికారులు సకాలానికి వచ్చి గండిని పూడ్చిచడంతో గ్రామస్తులకు మేలు జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మలిదేవి కాలువపై మరమ్మతులు చేసినా, ఒక్కరోజుకే గుంతలమయంగా తయారైంది. చెన్నూరుకు వెళ్లే దారిలో మలిదేవి కల్వర్టు వద్ద మళ్ళీ గుంతలు పడడంతో వాహనాల రాకపోకలకు అవస్తగా ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా నాణ్యతగా రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ చెరువులు, కాలువలు, రోడ్లు దెబ్బతిన్నాయో ఉన్నతాధికారులు సంబంధిత అధికార బృందాలతో వెంటనే అంచనా వేయించి, వాటి బాగుకు శాశ్వత ప్రాతిపదికపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# పెదనాన్నా!..నేనున్నా!

- ధైర్యంగా అంత్యక్రియలు చేసిన కుమార్తె



అనారోగ్యంతో మరణించిన తన పెదనాన్నకు నేనున్నానంటూ ధైర్యంగా ముందుకు వచ్చి అంత్యక్రియలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచిందామె. ఈ సంఘటన ఈనెల 20న మండల కేంద్రమైన సంగంలో జరిగింది. తన పెదనాన్న కొరిమెర్ల వెంకటేశ్వర్‌రావు(62) అనారోగ్యంతో ఆదివారం నాడు మరణించారు. ఆయన అవివాహితుడు కావడం, తమ నాన్న తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసుకుని ఉండడం వల్ల ఆ సమయానికి అంత్యక్రియలు చేసేందుకు వచ్చే వీలులేకపోవడం, మిగిలిన సోదరుల కుమారులున్నా వారు దూరప్రాంతాల నుంచి రాలేకపోవడంతో అంత్యక్రియలు ఎవరు చేయాలన్న విషయం అయోమయంగా మారింది. ఈ నేపథ్యంలో, తండ్రి చేయాల్సిన అంత్యక్రియలను ఆయన కుమార్తె డాక్టర్ పద్మావతి నిర్భయంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. అశ్రునయనాలతో ఆమె పెదనాన్న చితికి నిప్పంటించి దహన సంస్కారాలు చేస్తుండడం అందరినీ అబ్బురపరచింది. ఆడబిడ్డ అంటే అలా ఉండాలంటూ ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెను అభినందించారు.

# నవంబరు 15న.. కార్తీక దీపోత్సవం

రానున్న కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో నవంబరు 15న మహా కార్తీక దీపోత్సవ వేడుక ఘనంగా జరుగనుంది. నగరంలోని గణేశ్ ఘాట్ వద్ద నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఈనెల 20న ఆ సమితి అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల స్థానిక రామ్మూర్తినగర్‌లో జరిగిన సమావేశంలో చర్చించారు. శ్రీ రామానందభారతి స్వామీజీ (విశాఖపట్నం) సమక్షంలో ఆరోజున ఉదయం గోపూజతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. శ్రీశక్తి పీఠం తిరుపతి రమ్యానందభారతి మాతాజీ, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, ప్రముఖ అవధాని డా.బులుసు అపర్ణ, గీతాగాన ప్రవచన ప్రచారకర్త డా.ఎల్వి గంగాధరశాస్త్రి తదితరులు పాల్గొంటారని, పెద్దసంఖ్యలో మహిళలతో కార్తీక దీపోత్సవం ప్రదర్శన, జ్వాలాదీపం, ఆకాశదీపం, గంగాహారతి కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ప్రజలు భారీసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

## సవరణ

గత వారం 'లాయర్' (18.10.2024) సంచికలో 'ఎన్‌బికెఆర్‌కి న్యాక్ ఏ-గ్రేడ్ గుర్తింపు' అనే వార్తలో విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఆ గుర్తింపు వచ్చినట్లు పొరపాటున ప్రచురితమైంది. దానిని **'ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీకి న్యాక్ ఏ-గ్రేడ్ గుర్తింపు'** వచ్చినట్లుగా పాఠకులు గమనించ మనవి.

సం/-

## సవరణ

ఈ వారం 'లాయర్' (25.10.2024) సంచికలో 7వ పేజీలో ఆంధ్రప్రదేశ్ టిడ్కో ఛైర్మన్‌గా వేములపాటి అజయ్‌కుమార్ గుంటూరులో పదవీ బాధ్యతలు చేపట్టినట్లుగా పొరపాటుగా ప్రచురితమైంది. గుంటూరుకు బదులుగా **విజయవాడలోని టిడ్కో కార్యాలయంలో** ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించినట్లుగా పాఠకులు గమనించ మనవి.

– సం/-

## వైకాపా సీనియర్ నేత..
# 'పాపకన్ను' కన్నుమూత

### రాపూరు.. రాజకీయాల్లో ఒక పెద్దదిక్కును కోల్పోయింది



రాపూరు వైకాపా సీనియర్ నేత, దశాబ్దాల తరబడి రాపూరు నియోజకవర్గ రాజకీయాల్లో కీలకంగా ఉంటూ 'రాపూరు పెద్దాయన'గా పేరెన్నికగన్న పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి(81) అనారోగ్యంతో ఈనెల 19వతేదీ శనివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన మరణంతో వారి కటుంబసభ్యులు, స్థానిక నాయకులు, అభిమానులు విషాదంలో మునిగిపోయారు. 81 ఏళ్ల జీవితంలో, సుమారు 5 దశాబ్దాలకు పైగానే ఆయన రాజకీయాల్లో ఉంటూ, తనదైన శైలిలో రాజకీయాలు నడిపారు. కాంగ్రెస్ హయాంలో నువ్వుల వెంకటరత్నంనాయుడు రాపూరు రాజకీయాల్లో రాజ్యమేలుతున్నప్పుడు ఆయనకు అండగా ఉండేవారు. పాపకన్ను సోదరులుగా ప్రజలంతా బాగా అభిమానించే పాపకన్ను జయచంద్రారెడ్డి, పాపకన్ను రాజశేఖర్‌రెడ్డిలు రాపూరు అభివృద్ధికి తమవంతు సేవలందించారు. రాజకీయాలు నైతిక విలువలతో ఉండాలనే మనస్తత్వంతో వారు రాజకీయాలు నడిపారు. ఆ నైజమే వారికి ప్రజల్లో మంచిపేరు తెచ్చిపెట్టింది. పాతతరం నుంచి ఇటీవలి కాలం వరకు రాపూరు రాజకీయాల్లో పాపకన్ను సోదరులదే ప్రధానపాత్రగా ఉండేది. 1965లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాతకాలంలో రాపూరు సమితి అధ్యక్షులయ్యారు. అనంతరం మండల ప్రజాపరిషత్ అధ్యక్షులుగా, రాపూరు మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా కూడా అంకితభావంతో పనిచేశారు. 1994లో తెలుగుదేశం పార్టీలో చేరి ఆ పార్టీకి ఎనలేని సేవలందించారు. ఎమ్మెల్యేగా టిక్కెట్ వస్తుందని ఆశించి, రాకపోయినా విచారించలేదు. పార్టీని వీడలేదు. సుదీర్ఘకాలం ఆయన టీడీపీలో ఉన్నారు. 2003లో సోదరుడు జయచంద్రారెడ్డి మరణం ఆయన్ను కలచివేసింది. ఆతర్వాత, 2013లో వైఎస్ కుటుంబంపై అభిమానంతో ఆయన వైకాపాలో చేరిపోయారు. దాదాపు 50 ఏళ్లకు పైగానే రాపూరు రాజకీయాలను శాసించిన రాజశేఖర్‌రెడ్డి మరణంతో ఆ నియోజకవర్గం ఒక పెద్దదిక్కును కోల్పోయినట్లయింది. రాపూరు రాజకీయాల్లో ఒక శకం ముగిసినట్లయింది.

రాజశేఖర్‌రెడ్డి మరణవార్త తెలిసినంతనే పెద్దసంఖ్యలో నాయకులు, సహచరులు రాపూరుకు తరలివచ్చి ఆయన పార్థివదేహాన్ని సందర్శించారు. సమితి అధ్యక్షుడిగా, ఎంపీపీగా ఆయన ప్రజలకు చేసిన బహుముఖ సేవలను గుర్తుచేసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఫోన్ చేసి, రాజశేఖర్‌రెడ్డి మరణానికి చింతిస్తూ, ఆయన కుమారుడైన నిరంజన్‌రెడ్డిని పరామర్శించి ఓదార్చారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీమంత్రి.. వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైకాపా నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్, టీటీడీ మాజీఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తదితరులు రాజశేఖర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం నాడు వారి స్వస్థలమైన వేపినాపిలో రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియలు జరిగాయి.

## టూకీగా...



### మాలకొండ దేవాలయానికి 6.43 లక్షల ఆదాయం

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మాలకొండలో వెలసివున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి గత శనివారం ఒక్కరోజునే భక్తులు సమర్పించిన కానుకలు, ఇతర సేవల ద్వారా 6,43,024 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

### ఆత్మకూరులో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు జడ్పీహైస్కూల్‌లో ఇటీవల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు పెట్టి, విజేతలకు బహుమతులిచ్చారు. సీఐ గంగాధర్ పాల్గొని విద్యార్థులకు పోలీసుల సేవలను, పోలీసు అమరవీరుల త్యాగాలను వివరించారు. ఎస్‌ఐ జిలానీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సీతారామపురంలో హెల్మెట్ ధారణపై క్లాస్‌పీకిన ఎస్‌ఐ

మండల కేంద్రమైన సీతారామపురంలో ఈనెల 20న ఎస్‌ఐ శివకృష్ణారెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి, ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధారణపై క్లాస్ పీకారు. హెల్మెట్ ధరించడంవల్ల రోడ్డు ప్రమాదాల బారినపడకుండా రక్షణ ఉంటుందన్నారు. మద్యం సేవించి ఎవరూ వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

### పెంచలకోనలో నిత్యాన్నదానానికి 50వేల విరాళం

రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసివున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన స్వర్గీయ చింతగింజల చిన్నపెంచలయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి రాజేశ్వరి, కుమారులు ప్రదీప్, సుధీర్‌లు ఇటీవల 50,116 రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు.

### మనుబోలు పోలేరమ్మకు వైభవంగా గ్రామోత్సవం

మండల కేంద్రమైన మనుబోలులోని కోదండరామాపురంలో వెలసివున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి గ్రామోత్సవం ఈనెల 20న వైభవంగా జరిగింది. అర్చకులు అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు అనంతరం అంగరంగవైభవంగా జరిగిన గ్రామోత్సవంలో భారీసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### జి.చెరువుపల్లిలో కోడిపందాలపై పోలీసుల దాడులు

ఉదయగిరి మండలంలోని కొండకిందపల్లిలో ఉన్న గంగులవారి చెరువుపల్లి అటవీప్రాంతంలో కోడిపందాల స్థావరాలపై పోలీసులు ఈనెల 20న దాడులు చేసి ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రెండు పందెంకోళ్ళను, 10 మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.

### ముదివర్తిలో మునగాకుపై అవగాహన

విడవలూరు మండలం ముదివర్తి ఉప్పరతోపులోని అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు విశిష్టతపై గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు అవగాహన కలిగించారు. మునగాకులో ఎన్నో ఔషధ విలువలున్నాయని, దీని వినియోగం వల్ల అనేకరకాల వ్యాధులు దూరమవుతాయని చెప్పారు. ఏఎన్ఎం రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### వరికుంటపాడులో వ్యాధులపై కళాజాత

వరికుంటపాడు మండలంలోని గువ్వాడి, తూర్పు బోయమడుగుల, తూర్పు చెన్నంపల్లి గ్రామాల్లో ఇటీవల చైతన్య జానపద కళాబృందం నిర్వాహకురాలు పి.శ్యామలాదేవి ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణ పట్ల, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగించారు.

### మారెళ్లపాడులో రెవెన్యూ సదస్సు

దగదర్తి మండలం మారెళ్లపాడులో ఇటీవల డిప్యూటీ తహశీల్దార్ గిరీష్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ సదస్సు నిర్వహించి గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని అర్జీలు తీసుకున్నారు. మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# 499 రూపాయలకే...
# అపోలోలో.. 'క్యాన్సర్' పరీక్షలు




నెల్లూరులోని అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వారు తక్కువ ఖర్చుతోనే బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. డిసెంబరు 31వ తేదీ వరకు ఈ ప్రత్యేక రాయితీ ఉంటుందని ఆసుపత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, సర్జన్ డాక్టర్ బి.మనోభిరాన్, డాక్టర్ సి.హరిత ఈనెల 23న విలేకర్ల సమావేశంలో తెలిపారు. మహిళలకు ఉచిత కన్సల్టేషన్‌తో పాటు 1499 రూపాయలయ్యే పరీక్షలను 499 రూపాయలకే చేస్తామన్నారు. అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులను గుర్తించే అధునాతన వైద్య పరికరాలతో పాటు, నిపుణులైన వైద్యబృందం నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నారని తెలిపారు. ముందుగానే గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ రోగాలనైనా నివారించ వచ్చునని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో మహిళల్లో క్యాన్సర్ వ్యాధులు ఎక్కువ శాతం నమోదవుతున్నాయని, ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకుంటే వాటిని నివారించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా వారు ఆమేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కన్నులపండువగా.. శోభాయాత్ర



నెల్లూరు పప్పులవీధిలోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామీజీ, తిరుపతి శ్రీశక్తి పీఠం అధినేత్రి రమ్యానంద భారతి స్వామినిలను స్వాగతిస్తూ ఈనెల 23వ తేది సాయంత్రం నగరంలో నిర్వహించిన శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. పప్పులవీధిలో గురు దత్తాత్రేయమఠంలో సౌభాగ్య సరస్వతి అమ్మవారి నూతన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, పరివార దేవతల విగ్రహాల ప్రతిష్ఠతో పాటు, మహా కుంభాభిషేకాలను నిర్వహించేందుకు వారు రావడంతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వాగతించారు. ఈ ఉత్సవాలు బుధవారం నుంచి నాలుగురోజుల పాటు జరుగనున్నాయి. శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఆస్థానపండితులు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్ మాచవోలు అనూరాధ, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీధర్, మధుసూదన్‌రావు, వినయ్, లోకేష్‌బాబు, మోహన్‌రావు, ఏడుకొండలు, సాయి తదితరులు పాల్గొన్నారు.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com